కుంకుమ భరిణ

ప్రభాత కుమార ముఖర్జీ

మొదటి భాగం

1

దసరాకు హైకోర్టు మూసినప్పుడు వకీలు విజయకుమారబోసు పడమటకు ప్రయాణం పెట్టుకున్నాడు. అతను ప్రాక్టీసు చేస్తున్నది డబ్బుకోసం కాదు. తాత తండ్రుల ఆస్తి పుష్కలంగా ఉన్నది. లోయర్ సర్క్యులర్ రోడ్డులో అతని తండ్రి పెద్ద మేడ కట్టించాడు. అందులో మంచి ఫర్నీచరూ, విద్యుద్దీపాలూ, టెలిఫోనూ, నౌకర్లూ, చాకర్లూ, కారు షెడ్డులో మూడుకార్లూ – అన్నిహంగులూ ఉన్నాయి. విజయకుమారుడు తరుచు స్నేహితులనూ, బంధువులనూ ఆహ్వానించి పార్టీలిస్తూఉంటాడు.

విజయకుమారబాబు వయసు ఇరవైఏడేళ్ళు, పాశ్చాత్యదుస్తులు ధరిస్తాడు. చదువుకునే రోజుల్లో క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ మొదలైనవాటిల్లో పరిశ్రమ ఉండటంచేత అతని శరీరం బలిష్ఠమైనది. సిగిరెట్లు జాస్తిగా కాల్చటం తప్పిస్తే

అతనికి మరేవ్యసనమూలేదు. ఎప్పుడైనా నలుగురితో చేరినప్పుడు పెగ్గో అర పెగ్గో తాగుతాడు.

విజయకుమారబాబు భార్య అందచందాలలోనూ, స్వభావంలోనూ భర్తను పోలినదే. వారి కుటుంబాల మధ్య బాంధవ్యం ఉండేది. పెళ్ళికిముందు పరస్పరం పరిచయం ఉండే పెళ్ళాడారు. అతను కాలేజీలో ఉండగానే తన కాబోయే భార్య మీద పద్యాలు రాశాడు, ఆమెను తప్ప పెళ్ళాడనని తన స్నేహితులతో రహస్యంగా చెప్పేవాడు.

విజయుడి భార్యపేరు బకూ, లేక బకురాణీ. ఆమె తండ్రి పండితుడు కావటం చేత తన కుమార్తెకు వకుళావళిక అన్న పేరు పెట్టాడు. అందరూ వకుళబాలిక అని పిలిచేవారు. పెద్దదైతే ఏమని పిలవాలని ప్రశ్న వచ్చింది. ఆమె తల్లి ఆమె పేరును వకుళమాలగా మార్చేసింది. అందుచేతనే ఆమె అప్తులకు "బకూ", "బకురాణీ" అయింది.

వకుళమాల వయస్సిప్పుడు పంధొమ్మిదేళ్ళు. పెళ్ళిఅయి అయిదారు సంవత్సరాలయింది. మొదటి కాన్పుకు మగపిల్లవాడు పుట్టి, ఎనిమిదినెలలు పెరిగిపోయాడు. ఇప్పుడు ఏడాది వయసుగల ఆడపిల్ల ఉన్నది. దానికి పేరు పెట్టలేదు. అందరూ "చిట్టి" అని పిలుస్తారు.

వకుళమాల చాలాకాలం పడమటనే ఉన్నది. ఆమె తండ్రి పాట్నా కాలేజీలో ప్రొఫెసరుగా ఉండేవాడు. అందుచేత ఆమె మాటలలో చాలా హిందీమాటలు ఉంటాయి. పెళ్ళి అయినకొత్తలో ఆమెతో ఆకబిద్ద పావురాలసంగతి చెబుతూంటే ఆమెకు ఆపేపక్షిలో అర్థం కాలేదు; కబూతర్ అన్న హిందీమాట చెప్పాక ఆమెకు ఆ పక్షి లేవో తెలిశాయి. ఇప్పుడామె బెంగాలీభాష అంత అన్యాయం కాదుగాని, ఇప్పటికీ అప్పుడప్పుడూ హిందీమాటలు వస్తూనే ఉంటాయి.

విజయకుమారబాబు చెల్లెలొకామె వితంతువు. ఆమె అతనివద్దనే ఉంటున్నది. అతని అన్న చనిపోయాడు; అతనికిద్దరు పిల్లలు. అందరూ కలిసే ఉంటున్నారు.

హైకోర్టు మూసిన మర్నాడు వదినెగారు విజయుడితో, "పడమట పోతున్నావటగా ?" అన్నది.

"అవును, వదినా," అన్నాడతను.

ఆ రాత్రి వకుళమాల తన భర్త ప్రయాణం వివరాలన్నీ తెలుసుకుని, "మరీ ఆలస్యం చెయ్యక నవమినాటికి ఇంటికి తిరిగిరండి పండక్కుముందే మీ రింట్లో ఉండాలి. దశమినాడు నేను మీ పక్కన ఉండాలి," అన్నది.



"నవమినాటికి వస్తే చాలుగా ? ఇంకా ముందే వస్తాను," అన్నాడు విజయకుమారబాబు.

మర్నా డతను బయలుదేరేటప్పుడు పకుళమాల ముఖాన సంతోషచిహ్నం ఏ మాత్రమూ లేదు. "ఎక్కడ ఉన్నాసరే నాకు మీరు రోజూ టెలిగ్రాం ఇవ్వాలి; కనీసం ఉత్తరం రాయాలి," అన్న దామె.

2

సూర్యాస్తమయంవేళకు మెయిలు జబల్పూరు స్టేషనులో ఆగింది. ఫస్టుక్లాసు పెట్టెలోనుంచి విజయకుమారుడూ, పక్కపెట్టెలోనుంచి బేహరా దిగారు. బేహరా సామాన్లు దింపేస్తూంటే విజయకుమారుడు తంతి ఆఫీసు కేసివెళ్ళి, తాను క్షేమంగా జబల్పూరు చేరినట్టు భార్యకు తంతిఇచ్చి వచ్చాడు. తరవాత అతను కిరాయి బండిలో సామానుతోసహా ఎక్కి, దగ్గరలోనే ఉన్న డాక్‌బంగళాకు వెళ్ళాడు.

విజయకుమారుడు బంగళాలోకి వస్తూ, వరండాలో పేముపడకకుర్చీలో పడుకుని ఏదోపుస్తకం చదువుకుంటున్న ఒక యువతిని చూశాడు. ఆమె లోపలికి వచ్చే బండికేసి చూస్తూ, అది వరండాపక్కన ఆగగానే లేచి లోపలికి వెళ్ళిపోయింది.

ఖాన్‌సామా వచ్చి విజయకుమారుడికి సలాం చేసి, గది తెరిచి, టీ పట్టుకురాబోయాడు. బేహరాసామాన్లుతెచ్చి, గదిలోపెట్టి, పరుపుచుట్టవిప్పి మంచంమీద పరిచాడు.

ఖాన్‌సామా టీ తెచ్చినప్పుడు విజయకుమారు డతన్ని హిందీలో, "బంగళాలో ఇంకెవరైనా ఉంటున్నారా ?" అని అడిగాడు.

"అవును, హుజూర్. పాల్‌సాబ్, ఆయనభార్యా ఉంటున్నారు." అన్నాడు ఖాన్‌సామా.

"పాల్ సాబా? విదేశీయుడా?"

"కాదు, హుజూర్. ఈ దేశస్థుడే. ఆయన వచ్చి అయిదురోజు లయింది."

"ఆయన ఏం చేస్తారు?"

"ఉదయం ఛోటాహజ్రీ తీసుకుని, బాగ్‌తోసహా బయలుదేరి పదకొండింటికి తిరిగొస్తారు. మళ్ళీ మూడింటికి పోయి ఏడెనిమిదిగంటలకు తిరిగొస్తారు."

"ఆయన భార్యకూడా వెళతారా?"

"వెళ్ళరు ఇక్కడే ఉంటారు. హుజూర్ పోలీసాఫీసరా?" అన్నాడు ఖాన్‌సామా ఈ ప్రశ్నలన్నీ చూసి.

"కాదు, హైకోర్టు వకీలును."

ప్రయాణపు బడలికమీద ఉండటంచేత విజయకుమారుడు స్నానం చేసి ఏకంగా నైట్ డ్రెస్ వేసుకుని, భోజనంకూడా గదికే తెప్పించుకుని, భోజనం చేసి, పెంద లాడే పడుకున్నాడు.

మర్నాడు ఉదయం అతను ఛోటాహజ్రీ ముగించి, చుట్ట కాల్చుకుంటూండగా బేహరా వచ్చి ఒక విజిటింగు కార్డిచ్చాడు. దానిమీద "మిష్టర్ సి. కె. పాల్, కలకత్తా లైఫ్ ఎస్యూరెన్స్ కంపెనీ" అని ఉన్నది.

యజమాని చెప్పినమీదట బేహరా వెళ్ళి పాల్‌ను తీసుకొచ్చాడు. పాల్ నల్లగా, పొట్టిగా, పాశ్చాత్యుల వేషంలో ఉన్నాడు అసలే చిన్నకళ్ళు, అందులో ఒకటి మెల్ల. ముఖం గుర్రం ముఖంలాగా పొడుగుగా ఉంది. లావాటి పెదవులు.

విజయకుమారు డతనికి షేక్‌హాం డిచ్చి కూర్చోమని, "అవతలవైపు గదిలో ఉంటున్నది మీరేనా?" అని అడిగాడు.

విజయుడు బెంగాలీలో మాట్లాడుతూంటే పాల్ ఇంగ్లీషులో సమాధానం చెబుతూ తనకు బెంగాలీభాష కొంచెం కొంచెం తెలుస్తుందిగాని మాట్లాడటానికి రాదని చెప్పాడు.

"మీరు బెంగాలీ కారా?"

"కాను మహాశయా. మదరాసీని, నా భార్య బెంగాలీ."

"క్షమించండి. నేను బెంగాలీవా రనుకున్నాను. మీరు క్రైస్తవులా?" అని విజయుడు ఇంగ్లీషులో అడిగాడు

పాల్ అవునని చెప్పి, తాము ఆరుమాసాలక్రితం కలకత్తాలో బయలుదేరి,



దారిలో చాలాచోట్ల మజిలీలు చేస్తూ ఆరురోజుల క్రితం ఇక్కడికి వచ్చామనీ, తన వృత్తి బాగా సాగటంలేదనీ. హిందూదేశస్థులు తమ జీవితాలను భీమా చేసుకోవటానికి ఒకంతట ఒప్పుకోరనీ తాము అరవైఏళ్ళు బతుకుతామంటారనీ అన్నాడు. చివర కతను, "మీరు భీమా చేశారా ?" అని అడిగాడు.

"ఏనాడో చేశాను, మిష్టర్ పాల్," అన్నాడు విజయకుమారుడు.

రైలు స్టేషనుకు వెళ్ళవలసిన పని ఉన్నదని విజయకుమారుడు లేవడంతో మళ్ళీ దర్శనం చేసుకుంటా నని చెప్పి పాల్ వెళ్ళిపోయాడు.

రైల్లో కారూ, డ్రైవరూ దిగారు. విజయుడా కారులో జబల్పూరు వీధులు నాలుగూ చుట్టబెట్టి, పదిగంటలకు బంగళాకు తిరిగి వచ్చాడు. కారు చప్పుడు విని పాల్ భార్య వరండాలోకి వచ్చింది. ఆమె అప్పుడే స్నానం చేసి, బంగారు రంగుచీరె కట్టుకునిఉన్నది. ఆమె వెంట్రుకలు పిరుదులదాకా వెళ్ళాడుతున్నాయి. కాళ్ళకు మఖ్మల్ జూతా ఉన్నాయి. ఈసారి విజయుడి కామె ముఖం బాగా కన బడింది. ఆమెది మంచి శరీరచ్ఛాయ, కాళ్లు విశాలమైనవి, తీర్చిన ట్టున్న ముఖం. విజయుడి చూపులు తన చూపులతో కలవగానే ఆమె గదిలోకి వెళ్ళిపోయింది.

విజయుడు గడ్డం చేసుకుని, స్నానం చేసి, పదకొండింటికి భోజనం చెయ్యటా నికి డైనింగు రూముకే వెళ్ళాడు. అక్కడ పాల్ ఒక కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు. అతని భార్య కిటికీవద్ద నిలబడి, బయటి తోటలోకి చూస్తూ, విజ

యుడి పాదధ్వని విని వెనక్కి తిరిగిచూసింది. పాల్ ఆమెను విజయుడికి పరిచయం చేస్తూ, "బోస్ మహాశయా, ఈమె నా భార్య. సుశీ. వీరు బోస్‌మహాశయులు. పేరుమోసిన హైకోర్టు వకీలు. వీరి పేరు నువ్వు తప్పక వినిఉంటావు," అన్నాడు.

భోజనాలదగ్గిర సంభాషణ ఇంగ్లీషులోనే సాగింది. సుశీకి ఇంగ్లీషు అంత బాగారాదు. హిందీకూడా అంత బాగారాదు. భర్త ఆమెతో మధ్య మధ్య సగం బెంగాలీలోనూ, సగం హిందీలోనూ మాట్లాడాడు.

భాద్రపద మాసం. ఉక్క జాస్తిగా ఉంది. సుశీ తువాలుతో విసురుకుంటూ, చప్పున బెంగాలీలో, "అబ్బ, ఎంత ఉక్క ! ఇప్పుడు కలకత్తాలో కూడా ఇంత ఉక్కగానూ ఉందా ?" అని విజయుడికేసి చూసి అడిగింది.

భర్తకు రాని భాషలో భార్యతో సంభాషించటం భావ్యం కాదని, విజయుడామెతో ఇంగ్లీషులోనే, "నేను కలకత్తా వదిలి రెండువారాలు కావస్తున్నది. మిసెస్ పాల్. ఇక్కడంతవేడి అక్కడ ఉండదేమో !" అన్నాడు.

అతను తలఎత్తి చూసి, "పైన పంఖా ఉందే ! లాగేవాడు లేడా ?" అని అడిగాడు.

"రోజు కొక అర్ధరూపాయి స్తే ఖాన్‌సామా లాగేటందుకు మనిషిని పెడతాడు." అన్నది సుశీ బెంగాలీలోనే.

"సరే. మనిషిని ఏర్పాటు చేయిస్తాను," అన్నాడు విజయుడు ఇంగ్లీషులో.

విజయుడు ఖాన్‌సామాతో పంఖాలాగేవాణ్ణి పెట్టమనిచెప్పి, కాస్సేపు వరండాలో కుర్చీలు వేయించుకుని, పాల్‌దంపతులతో కబుర్లాడి, పన్నెండుగంటలకు లేచి గదిలోకి వెళ్ళి, తన భార్యకు ఉత్తరం రాసుకున్నాడు. అందులో తాను జబల్పూరు వచ్చినాక జరిగిన విషయాలు రాశాడు. పాల్‌దంపతులను గురించి తెలిపాడు, తన భార్యకోసం బంగారపు బ్రూచ్ కొంటున్నా నన్నాడు.

అతను ఉత్తరాన్ని పోస్టుకు పంపి, కాస్సేపు నిద్రపోయిలేచి, డ్రస్ చేసుకుని బయటివరండాలోకి వచ్చేసరికి, అక్కడ పాల్‌దంపతులు టీ తాగుతున్నారు. వారి పక్కనే అతనికోసం ఒక కుర్చీ ఖాళీగా ఉన్నది.

పాల్‌భార్య సుశీ విజయుడికి టీ కలుపుతూ చక్కెర ఎంత వెయ్యమన్నారని అడిగింది. రెండు చంచాలు వెయ్యమని విజయు డంటూఉండగే, పాల్, "వద్దు వద్దు, నువు తియ్యటిదానివి—

When lovely Susi sits by me,
I want no sugar in my tea–
Tra - la - la ia - ia - la,"

అని పాడుతూ అతను నృత్యం చెయ్యబోయాడు.

సుశీ అసహ్యంతోనూ, సిగ్గుతోనూ ముఖం తిప్పేసుకుంటూ "పాటట!" అన్నది

"ఎజ్, డియర్! ఇది కామిక్ సాంగ్! భాలూసాంగ్!" అన్నాడు పాల్.

"భాలూపాటా, భాలూనృత్యమూ." అన్నది సుశీ.

తన భార్య తనతో అన్నది కేవలం హాస్యం కాదనిపించి, "ఏమన్నావు, సుశీ?" అని అడిగాడు.

"మీ నృత్యం చూసి మిమ్మల్ని ఎలుగొడ్డంటున్నారు." అన్నాడు విజయుడు.

పాల్ తన భార్య భుజాలు తాకి తన రొమ్మును తాక్కుంటూ, "Beauty and the Beast" అని గట్టిగా నవ్వాడు.

అతను జేబుగడియారం తీసి చూసి నాలుగయిందని తెలుసుకుని, తాను మళ్ళీ ఎనిమిదింటికి వస్తానని చెప్పి విజయుడివద్దా, తనభార్యవద్దా సెలవు పుచ్చుకుని, గది లోకి వెళ్ళి హాటూ, బూటూ తీసుకుని, తనకోసం వేపచెట్టుకింద వేచిఉన్న కిరాయి బండిలో ఎక్కి వెళ్ళిపోయాడు.

విజయుడు వద్దంటున్నా వినకుండా సుశీ అతనికి మరొకకప్పు టీ కలిపింది. అతను టీ తాగుతుండగా సుందర్‌సింగు కారు తెచ్చాడు.

సుశీ ఆ కారుగురించి అడిగితే, అది కలకత్తానుంచి వచ్చిందనీ, రాజస్థానానికి అందులోనే వెళతాననీ విజయుడు చెప్పి లేచాడు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అన్నది సుశీ.

"చీకటిపడి వస్తాను. మీ రెవరైనా షికారు వెళతారా?" అని విజయు డడిగాడు.

"ఎక్కడికి వెళతాను? ఇక్కడే ఉంటాను." అంటూ సుశీ నిట్టూర్చింది.

"ఒంటరిగా ఎలా పొద్దుపోతుంది?"

"ఏంచెయ్యాలి? ఆరునెల్లనుంచీ ఇలాగే జరుగుతున్నది."

"ఆరునెల్లుగా ఇలా బంగళాలవెంబడి తిరుగుతున్నారా?"

"మా వివాహమై ఆరుమాసా లయింది. అప్పటినుంచీ ఇదేవరస. ఒక్కొక్కసారి గుబులుపుడుతుంది. ఏడుపొస్తుంది. ఎక్కడికీ వెళ్ళటానికి లేదు; ఏమీ చూట్టానికి లేదు. జబల్పూరు వచ్చి ఆరురోజు లయింది. చూడదగినవి ఏవో ఉన్నాయి.

ఒక్కటీ చూశ్చేదు. మనిషితో మాట్లాట్టానికూ్కడా లేదు. ఇవాళ మీతో రెండు ముక్కలు బెంగాలీలో మాట్లాడితే ప్రాణం లేచివచ్చింది "

ఆమె బెంగాలీ పుస్తకాలు చదువుతానంటే విజయుడు తన గదిలోనుంచి కొన్ని బెంగాలీ పత్రికలు తెచ్చి, ఆమెముందు బల్లమీద పెట్టాడు. తరువాత అతను కార్లో ఎక్కి బయల్దేరివెళ్ళాడు

కార్లో తిరుగుతున్నంతసేపూ అతను సుశీని గురించి బాధపడ్డాడు. ఆమె చాలా కష్టంలోనే ఉంది. ఇంత విశాల ప్రపంచంలో ఆమెకు ఈ పాల్ ఎక్కడ దొరికాడు ? చదువుకున్న బెంగాలీ క్రైస్తవుణ్ణి చూసి పెళ్ళాడి ఉండవలసింది. నిజంగా Beauty and the Beast లాగే ఉన్నారు వాళ్ళిద్దరూ. కాకిముక్కుకు దొండపండు.

అతను తిరిగి ఎనిమిదింటికి తన గదికి తిరిగివచ్చి బల్లమీద వున్న ఉత్తరాలకేసి చూడగానే, తన భార్యకోసం బ్రూచ్ కొనలేదన్నది జ్ఞాపకం వచ్చింది.

3

ఆరాత్రి విజయుడు తన గదికే భోజనం తెప్పించుకున్నాడు. ఆ దంపతులు భోజనం చేశారా అని అడిగితే ఖాన్‌సామా, 'మేమ్‌సాబ్' భోజనం చేశారనీ, 'ఆయన' నిద్రపోతూండటంచేత భోజనం గదిలో పెట్టాననీ అన్నాడు, సాభిప్రాయంగా నవ్వి.

తరవాత బేహరా వచ్చి తన యజమానితో రహస్యంగా, పాల్ తాగివచ్చాడనీ, ఆయన బండిలోనుంచి దిగుతూ తూలి పడబోతే బండివాడూ తనూ పట్టుకుని గదిలోకి తీసుకుపోయామనీ, ఆయన్ని మంచంమీద పడుకోబెటుతూంటే మేమ్‌సాబ్ వద్దని బల్లమీద పడుకోబెట్టించిందనీ, చెప్పాడు.

"మేమ్‌సాబ్ ఏమన్నది ?" అని విజయు డడిగాడు.

"ఏమీ అనలేదు. భోజనానికి కూర్చుని ఏడ్చింది మనం రాకముందుకూడా రెండురోజు లాయన పూటుగా తాగి వచ్చాట్ట. ఒకరోజు మేమ్‌సాబ్‌ను కొట్టి కింద పడేసినంతపని చేశాట్ట !"

ఈ సంగతి వింటూంటే విజయుడికి మండుకొచ్చింది. 'బీస్ట్, బీస్ట్,' అని పాల్‌ను తిట్టుకున్నాడు.

అతను సుశీని గురించే ఆలోచిస్తున్నాడు ఆమె చాలా చిన్నది. పద్దెనిమిది పంథొమ్మిదేళ్ళు మించి ఉండదు ఎందుకు తొందరపడి ఈ జంతువును పెళ్ళాడినట్టు. పెళ్ళి కాకపోతే కులం పోవటానికి హిందువైనా కాదు. ఏ మాయచేత వీ డీమెను

వంచించిఉంటాడు ? ఇలా అనుకుంటూ అతను కాలుస్తున్న సిగరెట్టును పూర్తి చేసి వెళ్ళి తనగదిలో పడుకున్నాడు.

మర్నాడు పదకొండుగంటలకు అతను డైనింగ్ రూముకు వెళ్ళేసరికి పాల్ దంపతు లింకా రాలేదు. వాళ్లు అతని వెనకగా వచ్చారు. విజయుడు కుర్చీలో నుంచి లేచి, సుశీకి దేశపద్ధతిలో నమస్కారం చేశాడు.

భోజనా లయాక విజయుడు తన భార్యకు రోజువారీ ఉత్తరం రాశాడు. నాలు గింటికి ఖాన్‌సామా వరండలో టీ ఏర్పాటు చేశాడు. అతని టీ బల్లదగ్గిరికి వెళ్లే సరికి పాల్‌దంపతులు బల్లవద్ద కూర్చునిఉన్నారు. తలనొప్పి ఎలా ఉన్నదని విజయు డడిగితే తగ్గిపోయిం దన్నది సుశీ. విజయుడికికూడా ఆమె టీ కలిపింది. వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ టీ తాగుతుండగా కారు వచ్చి వరండా మెట్లదగ్గిర నిలిచింది.

"మీ కారు చాలా బాగుంది. అందులో మమ్మల్ని ఒకపూట షికారు తిప్ప వలిసిఉంటుంది, మిస్టర్ బోస్," అన్నాడు పాల్.

"తప్పకుండా, ఎప్పుడు వస్తారు?"

"ఆదివారంనాడు పోదాం ఆరోజు నాకు రెస్టు," అంటూ పాల్ గడియారం తీసి, నాలుగైందని చూసుకుని, "ఇక నేను వెళ్ళాలి. ఈపూట మీ రేవేపు వెళుతున్నారు, మిస్టర్‌బోస్?" అని అడిగాడు.

"పట్నం దాటి ఏదైనా రోడ్డువెంట కొంతదూరం వెళ్ళివస్తాను." అన్నాడు విజయుడు.

పాల్ తనభార్యకేసి తిరిగి, "సుశీ, నువు బోస్‌గారివెంట షికారు వెళ్ళిరా కూడదూ? పొలాల గాలి వంటికి మంచిది...బోస్‌గారి కేమీ ఇబ్బంది లేకపోతే!" అన్నాడు విజయుడికేసి తిరుగుతూ

విజయుడు శాస్త్ర పస్తాయించాడు. ఈడు ఉన్నదాన్ని తనవెంట కారులో ఒంట రిగా తీసుకుపోవటం అంత భావ్యంకాదు. తీసుకుపోవవటం చాలా మోటు. చివర కతను తన కేమీ ఇబ్బంది లేదన్నాడు.

పాల్ వేపచెట్టుకింద నిలబడిఉన్న బండిలో ఎక్కి వెళ్ళిపోయాడు. బండి గేటు దాటివెళ్ళాక సుశీ విజయుడితో. "నేను వెంటరావటం మీకు శాస్త్ర అభ్యంతర మే; కాదూ?" అన్నది.

"ఎందుకూ?"

"ఏమో ! కొంచెం విసుగుమొహం పెట్టారు. మీ కేవిధమైన సందేహం ఉన్నా నన్ను తీసుకుపోవద్దు. ఒక్కరోజు గాలిషికారు తిరిగినంతమాత్రాన ఏంలాభం ?"

"లేదు. మిసెస్‌పాల్. మిమ్మల్ని ఒక గంటసేపు గాలిలో తిప్పితే నా కేమిటి ఇబ్బంది ? ఇంకోకప్పు టీ ఇవ్వండి; తాగి బయలుదేరదాం."

సుశీ తన పాదరక్షలు మార్చుకువస్తా నన్నది. ఆడవాళ్ళు ఒకంతట తెమలరనీ, త్వరగా రమ్మనీ అని విజయుడు తన గదిలోకి వెళ్ళాడు. అతను తల దువ్వుకుని, నెక్‌టై మంచిది ఎన్నుకుంటూ, ఎవతెనో తాను కారులో షికారుకు తీసుకువెళ్ళినట్టు తెలిస్తే బకురాణి ఏమనుకుంటుందో ననుకున్నాడు. అతను ముస్తాబై బయటికి వచ్చే వరికి సుశీ అతనికోసం వేచిఉన్నది.

పట్టణం దాటినాక చల్లనిగాలి వీచసాగింది. అంతదాకా మౌనంగా ఉన్న సుశీ, "ఎంత మంచిగాలి ! ప్రాణానికి హాయిగా ఉంది." అన్నది.

ఒక అరగంట అనంతరం వా రొక గ్రామాన్ని చేరవచ్చారు. గ్రామానికి ఇవత లనే ఒక మామిడితోటా, దాన్ని దాటితే ఒక కొండా కనిపించాయి. మామిడి తోటలో పక్షులు చాలాగోలగా అరుస్తున్నాయి. అక్కడ కాస్సేపు ఆగి అటూఇటూ తిరుగుదామన్నది సుశీ.

విజయుడు కారు ఆపించి, కిందికి దిగి, సుశీని వెంటబెట్టుకుని మామిడితోటలోకి ప్రవేశించాడు. రాలిన ఆకులు నేలపై గుట్టలుగుట్టలుగా పడిఉన్నాయి. వారు వాటి మీదుగా నడుస్తూ కొండకేసి వెళ్ళారు.

సాయంకాలం అవుతూండటంచేత పశువులకాపరికుర్రాళ్ళు పశువులను గ్రామా నికి మళ్ళించుకుపోతూ వారికి ఎదురు వచ్చారు. వాళ్ళలో ఒకడు, "సలాం సాబ్, సలాం మేమ్‌సాబ్." అన్నాడు.

సుశీ చెక్కిళ్ళు ఎర్రబారాయి. ఆమె మరుక్షణమే తనను తాను నిగ్రహించుకుని "ఈ కొండమీద పులులూ, ఎలుగుబంట్లూ ఉంటాయా ?" అని ఆ కుర్రాణ్ణి అడిగింది.

"ఇంత చిన్న కొండమీద పులులూ, ఎలుగుబంట్లూ ఎలా ఉంటాయి ?" అన్నాడు వాడు.

ఇద్దరూ కొండను సమీపించాక విజయుడు కొండ ఎక్కుదామన్నాడు. "ఎక్క గలరా?" అని అడిగా డామెను.

"చిన్నతనంలో ఎప్పుడూ కొండ ఎక్కేదాన్ని. హజారీబాగ్‌లో మా అక్కయ్యా

వాళ్లు మిషనరీలుగా ఉండేవాళ్ళు. మిషన్ హౌస్ పక్కనే కొండ ఉండేది. అందరమూ దానిమీది కెక్కి ఆడుకునేవాళ్ళం."

సన్నని కాలిబాటవెంబడి నూరడుగుల ఎత్తు ఎక్కేసరికి ఇద్దరూ అలిసిపోయారు. దారికి ఎడంపక్కగా ఒక చట్రాయి కనిపించింది. అది కూర్చోవటానికి అనుకూలంగా ఉన్నది. కాని దాని దగ్గరకి దారిలేదు. విజయుడు సుశీని చెయ్యి పట్టుకుని నడిపించవలసివచ్చింది.

ఇద్దరూ ఆ రాతిమీద కూర్చొని కిందికి చూస్తే దృశ్యాలు చాలా అందంగా కనిపించాయి. చల్లనిగాలి వీస్తుండటంచేత ఇద్దరికీ క్షణంలో ఆయాసం తీరింది. ఒక అరగంట అక్కడే కూర్చుని, చీకటిపడితే కొండ దిగటం కష్ట మవుతుందని బయలుదేరారు.

4

ఆ రాత్రి విజయుడు భోజన మయాక బయట వాలుకుర్చీ వేయించుకు పడుకుని వెన్నెలను చూస్తూ ఆరోజు జరిగిన సంగతులు విమర్శించుకున్నాడు. ఆలోచించిన కొద్దీ జరిగినది అతనికి నచ్చలేదు. తాను పాల్ భార్యను షికారుకు తీసుకుపోయినట్టు తెలిస్తే బకురాణీ ఏమనుకుంటుంది. పాశ్చాత్య నాగరికత అలవడిన వారికి అది సాధారణమైన సంగతే, కాని కఠినమైన హిందూ సంస్కారపు కట్టుబాట్లలో జీవించేవారి కది బాగుండదు.

ఈ సంగతి బకురాణీకి రాయాలా, వద్దా అన్న ప్రశ్న ఒకటి అతన్ని వేధించింది. తన భార్య మరొకచోటికి వెళ్ళి, అక్కడ ఒక అందగాడైన యువకుడి వెంట ఒంటరిగా చాలాదూరం షికారు వెళ్ళి వచ్చినట్టు రాస్తే తన కెలా ఉంటుంది? బకురాణీ కోరినట్టు ఆమెనూ, పరివారాన్నీ వెంట తీసుకువస్తే, ఈ బంగళా మకాములూ, ఇతరులను షికారు తిప్పటాలూ జరిగే అవకాశం ఉండకపోను.

అతను గదిలోకి వెళ్ళి పడుకోవటం ఇష్టంలేక పంఖావాణ్ణి కాస్సేపు నిద్రపొమ్మని అవతలికి పంపేశాడు బయటనే చాలా ఉక్కగా ఉంది. పాల్ దంపతులు తలుపులు మూసుకుని లోపల పడుకున్నారు. ఆ ఉక్కలో సుశీ ఎలా నిద్రపోతుంది? నిద్రలేక మళ్ళీ తలనొప్పితో బాధపడుతుం దేమో. పాల్ కూలీని ఏర్పాటు చేస్తా నన్నాడు, కాని కూలీ లేడు.

అతను తన కూలీని మళ్ళీ పిలిచి, పాల్‌సాబ్‌గారి గదిలో పంఖా లాగేవా డేడీ?" అని అడిగాడు.

"నాలుగ్గంటలకు వాడు వెళ్ళి పోతాడు." అన్నాడు కూలీ.

"అయితే నువే వెళ్ళి ఆ గది పంఖా లాగు "

"బహుతచ్చా? హుజూర్."

విజయుడు అంతగా అయితే తెల్లవార్లూ పడకకుర్చీలోనే బయట పడుకుందామనుకుని ఈ పని చేశాడు.

మర్నాడు ఉదయం ఏడున్నరకు విజయుడు తన గదిలో టీ తాగుతుండగా పాల్ వచ్చి, గుడ్‌మార్నింగ్ చెప్పి, "రాత్రి మీకు, చాలా శ్రమ అయిం దనుకుంటాను," అన్నాడు.

"మిసెస్ పాల్‌కు నిద్రపట్టకపోతే తలనొప్పి వస్తుందేమో ననుకున్నాను. మా పంఖా లాగేవాడు లేడు. రాత్రీ అమిత ఉక్కపోసింది."

తాను రాత్రి పంఖా లాగటానికి మనిషిని రమ్మంటే వాడు రాలేదనీ, పన్నెండు గంటలు దాటాక పంఖా ఆడటం ప్రారంభించేదాకా తనకు నిద్ర పట్టలేదని తన భార్య చెప్పిందనీ పాల్ అన్నాడు. కిందటి సాయంకాలం తన భార్యను విజయుడు షికారుకు తీసుకుపోయినందుకుకూడా అతను ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయాడు.

తొమ్మిదిగంటలకు సుశీ స్నానంచేసి, సరిగంచు నల్లచీరె కట్టుకుని, జరీకమ్ముల ఊదా జాకెట్టు తొడుక్కుని, విజయుడి గదిలో ఒక గంటసేపు కూర్చుని ఆ కబుర్లూ ఈ కబుర్లూ ఆడింది. పంఖా లాగేవాణ్ణి తన గదిలో పంఖా లాగటానికి పంపి, విజయుడు తెల్లవార్లూ బయట కుర్చీలో పడుకున్నందుకు తనకు చాలా కోపం

వచ్చిందన్నది. విజయుడు రోజుకు పాతిక సిగరెట్లు కాలుస్తుంటే, అతని భార్య ఊరుకుంటుందా అన్నది. ఆమె పే రేమిటన్నది. బకూ అంటే అర్థ మేమిటన్నది. బకురాణి అనటంకంటె వకుళమాల అంటేనే బాగున్న దన్నది. తాము కలకత్తా వచ్చి బకురాణితో స్నేహం చేసుకుంటా నన్నది.

పదిగంటలప్పుడు విజయుడు గడియారం తీసి చూసి, "బజారుకు వెళ్ళిరావాలి. బకురాణికోసం బ్రూచ్ కొందా మనుకుని ఎప్పటికప్పుడు మరిచిపోతున్నాను." అంటూ బండి తీసుకురమ్మని లక్ష్మణబేహరాకు కేకపెట్టాడు.

"బ్రూచ్‌లో చాలా రకా లున్నాయి. ఒక రకమయినది చాలా బాగుంటుంది. అందులో —" అని సుశీ ప్రారంభించేసరికి, విజయుడు ఆమెనుకూడా తన వెంట బజారుకు రమ్మని కారులో తీసుకుపోయాడు.

వాళ్ళు పదకొండు లోపల తిరిగివచ్చి, ఎవరి గదికి వారు వెళ్ళారు. విజయుడు తాను కొనితెచ్చిన వస్తువులన్నీ బల్లమీద తెరిచిపెట్టి పరీక్షించాడు. అందులో రెండు సెట్ల షర్టు గుండీలూ, ఒక జత రాళ్ళు పొదిగిన బంగారు గాజులూ, రెండుజతల చెవి పోగులూ, రెండు బ్రూచ్‌లూ, ఉన్నాయి. గాజులు చాలా ఖరీదైనవి. అవి బకురాణీ కోసం కొన్నాడు. చెవి పోగులు తన కూతురు చిట్టికోసమూ, తన వదినెగారి కూతురు సరోజిని కోసమూ కొన్నాడు. బ్రూచ్‌లలో ఒకటి బకురాణీ కోసం — రెండోది సుశీకి ఇద్దామనుకుని కొన్నది. ఆ బ్రూచ్ ఉన్న పెట్టెను

విడిగా పెట్టి, ఒక కాగితముమీద "కృతజ్ఞతాపూర్వకంగా" అని రాసి, దస్కతు చేసి, తేదీవేసి ఆ పెట్టెలో పెట్టాడు. ఆ పెట్టెను తన కోటుజేబులో పెట్టుకున్నాడు.

భోజనం సిద్ధంగా ఉందని ఖాన్‌సామా పిలిచాడు. విజయుడు డ్రైవింగ్‌రూమ్‌కు వెళ్ళేసరికి సుశీ ఇంకారాలేదు. పాల్ కూర్చుని సిగిరెట్టు కాల్చుకుంటున్నాడు. విజయు డతన్ని చూసి, "ఇవాళ మిసెస్‌పాల్‌కు చాలా శ్రమయిచ్చాను." అన్నాడు.

"విన్నాను ఏమీ బాగాలేదు మహాశయా." అన్నాడు పాల్.

"ఏం ?"

"మా కంపెనీలో ఓ బెంగాలీబా బున్నాడు. పిసినిగొట్టు. నేనూ మరికొందరమూ కల్పి ఆయన భార్యకు పెద్ద నగలకేటలాగ్ పంపించాం!" అంటూ పాల్ పెద్దగానవ్వాడు.

"తరవాత ?"

"ఏముందీ ? ఆ బెంగాలీబాబుకు ఇల్లు నరకమయింది. ఇంతకూ మేం పంపింది కేటలాగే. మీరు సుశీని తిన్నగా నగలదుకాణానికే తీసుకువెళ్ళారు. నగలదుకాణానికి వెళ్ళిన ఆడది చేపల అంగడిలోకి వెళ్లిన పిల్లిలాగా అయిపోతుంది," అంటూ పాల్ మళ్ళీ పెద్దగా నవ్వాడు.

సుశీ వచ్చి, "ఏమటి జోక్ ?" అని అడిగింది.

"మీ భర్త మిమ్మల్ని పిల్లి అంటున్నారు. సుశీకి 'పుశీ' ప్రాస బాగా కుదిరిందన్నారు." అన్నాడు విజయుడు.

"అన్యాయం, మిస్టర్ బోస్," అన్నాడు పాల్.

సుశీ ఆ ఇద్దరికేసీ చూసి, "మీ రేదో కల్పించారు. నా కేమీ అర్థం కావటం లేదు." అన్నది.

విజయుడు జేబులోనుంచి. పెట్టె తీసి ఆమె కిస్తూ, "పిల్లిగారూ, ఇందులో ఒక చిన్న చేప ఉన్నది. తీసుకోండి," అన్నాడు.

సుశీ పెట్టె తెరిచి చూసి, కొంచెం సిగ్గుపడి, ఆటే ఇష్టం లేనట్టుగా, "ఇది నా కెందు కిస్తున్నారు ? మీ వాళ్ళకోసం కొన్నారుగద !" అన్నది.

"లేదు, మిసెస్ పాల్, మీ కోసమే కొన్నాను."

భోజనం అయాక విజయుడు తన భార్యకు ఉత్తరం రాయటానికి కూర్చొని, నిన్నటి సాయంకాలం షికారూ, రాత్రి పంఖా విషయమూ, నగలు కొనటానికి సుశీ సహాయపడటమూ, కృతజ్ఞతాపూర్వకంగా తాను ఆమెకు కూడా ఒక బ్రూచ్ కొనటమూ, పిల్లిజోకూ—అన్నీ రాసేసి, మనసు తేలికపరచుకుని, రాత్రికూడా నిద్ర లేనందువల్ల హాయిగా నిద్రపోయాడు.

5

విజయుడు నిద్ర లేచేసరికి అయిదుగంటలయింది. అతను ముఖం కడుక్కుని, దుస్తులు వేసుకుని, వరండాలోకి వచ్చేసరికి టీ టేబిల్‌వద్ద సుశీ ఒంటరిగా కూర్చుని పుస్తకం చదువుకుంటున్నది. పాల్ బయటికి వెళ్లి చాలాసేపయిందనీ, ఆయన రాత్రికి ఎవరో స్నేహితుడింట భోజనం చేసి అక్కడే పడుకుంటాడనీ ఆమె విజయుడితో అన్నది.

ఖాన్‌సామా విజయుడికి టీ తెచ్చాడు. సుశీ అతనికో కప్పు టీ కలిపిఇచ్చి తానొక కప్పు కలుపుకుని, "ఇవాళ ఎటూ షికారు వెళ్ళరా ?" అని అడిగింది.

ఆమెను ఇక ఎన్నడూ ఒంటరిగా షికారు తీసుకుపోరాదని నిర్ధారణ చేసుకున్న విజయుడు, "ఇవాళ ఎటూ వెళ్ళాలని లేదు," అన్నాడు.

విజయుడికి వెళ్లిపోవాలనే ఆలోచన వచ్చింది సుశీ తనకు మరీ దగ్గర అయిపోతున్నది. ఆమెనుచూసి తాను జాలిపడిన కారణంచేతనే వారి మధ్య స్నేహం ఇలా పెరిగిపోయింది.

"రేపీపాటికి నేను చాలాదూరాన ఉంటాను," అన్నాడతను.

"ఏమిటీ ? వెళ్లిపోతున్నారా ?" అన్నదామె ఉలికిపడి.

"అదే ఆలోచన. కలకత్తాకు వస్తే మమ్మల్ని తప్పక చూడవస్తారు గదూ ?"

"కలకత్తా రావటమంటూ ఈ జన్మలో ఉంటేనా !"

"ఏం, పాల్‌గారి హెడ్డాఫీసు అక్కడేగా ?"

"ఆయిన ఎందులోనూ స్థిరంగా ఉండరు. మధ్యమధ్య బొంబాయి పోతానంటారు...కలకత్తాకు వస్తేమాత్రం మీ ఇల్లెలా తెలుస్తుంది?"

"ఒక ఉత్తరంముక్క రాస్తే నేను వచ్చి తీసుకుపోతాను."

"మిస్టర్ బోస్, వకీల్, హైకోర్టు అని రాయమంటారా? మీ పూర్తి పేరేమిటి?"

విజయుడు చెప్పాడు.

సుశీ అతనికి తన పూర్వవృత్తాంతం చెప్పింది ఆమె తండ్రి కలకత్తాలో ఒక బాప్టిస్టు మిషనరీగా ఉండేవాడు ఆయన పోయేటప్పటికి సుశీ పదకొండేళ్ళది. ఆమెకు తోబుట్టువు లెవరూలేరు. హజారీబాగ్‌లో పినతండ్రి ఉండేవాడు. ఆయన సుశీతల్లికి పంతులమ్మపని ఇప్పించాడు. పినతండ్రికూడా పోయి, సుశీ తన తండ్రి స్నేహితుడింట ఉండి మిషన్‌పని నేర్చుకుంటూండగా పాల్ తటస్థపడ్డాడు. కొద్ది రోజులకే ఇద్దరూ పెళ్లాడారు. పెళ్లి అయాక కొద్దిమాసాలు కలకత్తాలో ఉండి, ఆ తరవాత సంచారం ప్రారంభించారు. పాల్ స్వగ్రామం మద్రాసుదగ్గిర వేలుపేట.

ఇలా వా రిద్దరూ మాట్లాడుకుంటూండగానే రాత్రి తొమ్మి దయింది. వారికి భోజనం వచ్చింది. భోంచేస్తూ సుశీ, "నా చరిత్ర విన్నారు. మీ చరిత్ర కూడా చెప్పండి." అన్నది.

"కలకత్తాలో పుట్టాను. అక్కడే చదువుకున్నాను. పెళ్ళి అయింది. హైకోర్టులో ప్రాక్టీసు చేస్తూంటాను. శలవుల్లో సంచారం చేస్తాను," అన్నాడు విజయుడు.

"అంతేనా? మీ చరిత్ర అంతా చెప్పాలి. బయట కూర్చుందాం పదండి. నిద్ర పోయేదాకా మీ చరిత్ర వినాలి."

వారు భోజనం ముగించి మూతులు తుడుచుకుంటూ ఉండగా బంగాళా ఆవరణలోకి ఒకబండి వచ్చింది. బేహరా వచ్చి: మేమ్‌సాబ్ గారికి కోచ్‌మన్ ఈ జాబు తెచ్చాడు. వాడికి బండి బాడుగ రావాలిట," అన్నాడు.

సుశీ ఉత్తరం చదువుతూంటే ఆమె ముఖం మారిపోయింది.

"ఏమిటి విశేషం?" అన్నాడు బోస్ ఆమె ముఖంకేసి చూస్తూ.

ఆమె ఉత్తరాన్ని అతనిముందు పడేసి, బల్లమీదికి వాలి, ముఖానికి చేతు లడ్డం పెట్టుకుని, వినపడీ వినపడకుండా ఏడవసాగింది.

విజయుడు ఉత్తరం తీసి చదువుకున్నాడు. ఇంగ్లీషులో రాసిన ఆ ఉత్తరం ఇలా ఉన్నది.

"డియర్ సుశీ, నేను బొంబాయి పోతున్నాను. నేను డబ్బు ఇబ్బందిలో ఉన్న

సంగతి నీకు తెలుసు. భవిష్యత్తు బాగుంటుం దనే ఆశతో నిన్ను పెళ్ళాడాను. నా ఉద్యోగంకాస్తా పోయింది. నన్ను డిస్మిస్ చేసినట్టు కలకత్తానుంచి ఉత్తరం వచ్చింది. ఆ మాట నీకు చెప్పలేదు. ఈ స్థితిలో నిన్ను పోషించలేను. నాతోబాటు నువు కష్టాలు పడటం నా కిష్టంలేదు. కలకత్తా వెళ్ళి హైకోర్టులో వివాహం రద్దు చేసుకో. నేను నీపట్ల క్రూరంగా ప్రవర్తించా ననీ, నిన్ను వదిలిపెట్టి పోయా ననీ రుజువు చేస్తే విడాకు లిచ్చేస్తారు మనం దిగిన డాక్‌బంగళా బట్లర్లు నీకు సాక్ష్యం ఇస్తారు. వకీలు బోసుగారు నీకు సహాయం చెయ్యగలరు. బొంబాయి టిక్కెట్టుకు సరిపోయే డబ్బే ఉంది. బండివాడికి, నీ దగ్గిర ఉంటే, మూడురూపాయ లిచ్చిపంపు.

— సి. పాల్."

ఉత్తరం చూసి విజయుడికి మండిపోయింది. పాల్‌ను తిట్టుకుని, "ఆయన ఏ బండిలో వెళ్ళారు ?" అని కోచ్‌మన్‌ని అడిగాడు.

"తొమ్మిదింబావు బండిలో."

"మెయిల్ బండా ?"

"బొంబాయి పాసింజరు. నా బాడుగ ఇప్పించండి."

విజయుడు మూడురూపాయలు తీసి వాడి కిచ్చి పంపించేశాడు.

అతను గదిలోకి వచ్చేసరికి సుశీ, "పోలీసులకు రిపోర్టు చేశారా ?" అన్నది.

"పోలీసు లేం చెయ్యగలరు ?" అన్నాడు విజయుడు.

"నన్ను పెళ్ళిచేసుకుని నట్టేట ముంచి వెళ్ళిపోయాడు. పోలీసు లేమీ చెయ్యలేక పోతే నాగతి ఏమిటి ? ఎక్కడికి పోతాను ? నా చేతిలో రూపాయికూడా లేదు. నా సంగతి ఏమిటి, విజయబాబూ ?"

విజయుడు తలవంచుకుని మాట్లాడలేదు

"టెలిగ్రాం ఇచ్చో, మరోవిధంగానో ఆయన్ను దారిలో ఆపేస్తే ?"

"అందువల్ల లాభం ?"

"ఎదటపడితే ఎలా నన్ను విడిచిపెడతాడో చూస్తాను !"

విజయుడు టైమ్‌టేబిల్ తెప్పించి చూసి, "మెయిలు సాయంకాలమే వెళ్ళిపో యింది. ఇప్పట్లో బొంబాయికి వెళ్ళే మరోబండి కనబడదు." అన్నాడు

"ఉంటేమటుకు చేసే దేమిటి? నాదగ్గిర టిక్కెట్టుకూడా డబ్బులేదు!" అంటూ సుశీ నిట్టూర్చింది.

"ఆయన్ను పట్టుకుంటే మీకు నిజంగా లాభిస్తుందా ?" అని విజయు డడిగాడు.

"తప్పకుండా."

"అయితే ఒకపని చేద్దాం. పాసింజరు ప్రతి స్టేషనులోనూ ఆగుతూపోతుంది. ఇప్పుడు తొమ్మిదీయాభై ఆరైంది. రాత్రి రెండూ ఆరుకు పాసింజరు సోహాగ్‌పూర్ స్టేషను చేరుతుంది. 122 మైళ్ళదూరం. కారులో పోతే రెండులోపుగా సోహాగ్‌పూర్ చేరకుంటాం. భోపాల్‌దాకా మంచిరోడ్డున్నది. రైలుదారి నానుకునే వెళుతుంది."

సుశీ తన ముఖాన్ని చేతులతో మూసుకుని, "మీకు చాలా శ్రమ అవుతుంది విజయబాబూ," అన్నది

"ఏమీ శ్రమలేదు, పదండి. వెంటనే సిద్ధంకండి." అంటూ విజయుడు బేహారాతో సుందరసింగును పిలవమని చెప్పాడు

"మీరు లేకపోతే నాగతి ఏమైఉండేది?" అని కళ్ళు తుడుచుకుంటూ సుశీ తన గదిలోకి వెళ్ళింది.

సుందర్‌సింగ్ వచ్చాడు. విజయుడు పెట్రోలు సరిపోయినంత ఉన్నదని తెలుసుకుని వెంటనే పట్టుకురమ్మని, బెడ్డింగూ, సూట్‌కేసూ, టిఫిన్‌బాక్సూ సిద్ధం చెయ్యమని బేహారాతో చెప్పాడు.

బండి వచ్చి వరండా మెట్లదగ్గిర ఆగింది. బేహరా సామాన్లు అందులో పెట్టాడు. విజయుడు సుశీని చెయ్యిపట్టుకు తీసుకుపోయి వెనకసీట్లో కూర్చోబెట్టి, తాను ప్రక్కన కూర్చున్నాడు. అతను బేహారాతో రేపు మధ్యాన్నానికో సాయంకాలానికో తిరిగి వస్తానని చెప్పి, సుందర్‌సింగుతో బండిని పోనిమ్మన్నాడు.

పదినిమిషాలలో కారు పట్నం దాటి రైలుమార్గం పక్కనే ఉన్న రోడ్డుమీదగా పోసాగింది. రోడ్డు దాదాపు నిర్మానుష్యంగా ఉంది. పైన చంద్రుడు ప్రకాశిస్తున్నాడు.

త్వరలోనే మీర్‌గంజ్ స్టేషను వచ్చింది. అక్కడికి కొంతదూరంలో పాలరాళ్ళ గనులున్నాయి. ఒక్కొక్క స్టేషనే దాటుతూ కారు పోతున్నది. ఒక గంట గడిచింది. సుశీ తల నిద్రమత్తుతో వాలిపోతూ మధ్యమధ్య ఉలిక్కిపడి లేస్తున్నది.

సుశీకి నిద్ర వస్తున్న పక్షంలో తాను ముందుసీటులో డ్రైవరు ప్రక్కన కూచుంటాననీ, వెనక సీటులో ఆమె ముడుచుకుని పడుక్కోవచ్చుననీ విజయుడన్నాడు. సుశీ తనకు నిద్ర రావటంలేదనీ, రాదనీ అన్నది. కాని పదినిమిషాలన్నా తిరగకుండానే ఆమె తల విజయుడి భుజముపైన వాలిపోయింది. అతడామెను లేపలేదు. కారు నర్మదా వంతెనపైన పోతుండగా ఆమె లేచింది.

మరోగంట గడించింది. ఏదో స్టేషనుతాలూకు ఎర్రదీపాలూ, పచ్చదీపాలూ కనిపించాయి. విజయుడు స్టేషను బయట కారు ఆపించి, సుశీని వెంటబెట్టుకుని

ప్లాట్‌ఫాం మీదికి వెళ్ళాడు. అది బోహానీ స్టేషను. బొంబాయి పాసెంజరు 15 నిమిషాల క్రితం ఆ స్టేషను వదిలిపోయిందనీ, సోహాగ్‌పూర్ అక్కడికి యాభైమైళ్ళుంటుందనీ స్టేషనుమాస్టరు చెప్పాడు.

కారు రెండుగంటల పదిహేను నిమిషాల కాలంలో డెబ్బయిరెండు మైళ్ళు వచ్చింది; రెండుగంటల వేళకు మిగతా యాభైమైళ్ళూ వెళ్ళటం సాధ్యమేనని విజయుడు సుశీకి ధైర్యం చెప్పాడు.

ఇద్దరూ వెళ్ళి కారులో కూర్చున్నారు. కారు మళ్ళీ స్టార్టయింది. అరగంటలో మరిరెండు స్టేషన్లు వచ్చాయి కారు ఇంకొంచెం వేగంగా పోనిమ్మని విజయుడు సుందర్‌సింగును హెచ్చరించాడు.

ఇంకో స్టేషను కూడా దాటింది. ఒకటిన్నర కావస్తున్నది. రైలుపట్టాలమీద మూడు ఎర్రదీపాలు కనిపించాయి. బ్రేక్‌వాన్ దీపాలు.

"అదే మనం పట్టుకునే బండీ," అన్నాడు విజయుడు.

సుశీ బ్రేక్‌వాన్ దీపాలకేసి తదేకదృష్టితో చూసింది. అవి క్రమంగా దగ్గిర అవుతున్నాయి. కారు రైలుకన్న వేగంగా పోతున్నది. చూస్తుండగానే బ్రేక్‌వాన్ చేరుకుని, దాన్ని దాటి, ఆతరవాత ఒక్కొక్క బోగీనే దాటుతూ, చివరకు ఇంజన్నుసైతం దాటి ఇంకా ముందుకు వెళ్ళింది.

పాల్ ఆ బోగీలలో ఎందులోనో ఉన్నాడు.

"వచ్చేదేనా సోహాగ్‌పూర్ స్టేషను?" అని సుశీ అడిగింది.

"కాదు. పిసారియా స్టేషను. దీని తరవాతది సోహాగ్‌పూర్. పిసారియా స్టేషనులో బండి మూడు నిమిషాలే నిలుస్తుంది సోహాగ్‌పూర్‌లో పది నిమిషాలుంటుంది. వెతుక్కోవటానికి వ్యవధి ఉంటుంది," అన్నాడు విజయుడు

కారు పిసారియా స్టేషను చేరేసరికి రైలింకా రాలేదు. విజయుడు వెనక్కు తిరిగి చూస్తే ఇంజను దీపాలు కనిపించాయి. అతను సుందర్‌సింగుతో, వీలుంటే కారును మరింత వేగంగా పోనిమ్మన్నాడు

కారు పూర్తివేగంతో పోతున్నది. విజయుడు వెనక్కు తిరిగిచూస్తే రైలు దీపాలు కనబడటం లేదు రోడ్డు దొత్తిగా పాడుగా ఉండటంవల్ల కుదుపు జాస్తిగా ఉన్నది సుశీ విజయులు ఒకరిమీద ఒకరు పడిపోతున్నారు

అంతలో తుపాకీ పేల్చిన చప్పుడులాటి దయింది. టైర్ బద్దలయింది. బండి ఒక మూలకు ఒరిగి నడుస్తున్నది. సుందర్‌సింగ్ ఇంజను స్విచాఫ్ చేసి, కొంచెం కొంచెంగా ఎమర్జెన్సీ బ్రేక్ వేశాడు

"విజయబాబూ, ఇప్పు డేం చేసేట్టు ?" అన్నది సుశీ

"చక్రం మార్చాలి."

కారు డిస్టెంట్‌సిగ్నల్ ప్రాంతాల ఆగింది. డ్రైవరూ, విజయుడూ, సుశీ బయటికి దిగారు. సుందర్‌సింగ్ జాకీ తీసి ఆక్సిల్‌కింద పెట్టి చక్రం పైకెత్తుతూ, "అరనిమిషం, హుజూర్." అన్నాడు.

"అదుగో, రైలు వచ్చేస్తున్నది." అన్నది సుశీ.

దూరాన రైలుఇంజను దీపాలు కనపడ్డాయి.

"సుందర్‌సింగ్, జల్దీ ! జల్దీ !" అన్నాడు విజయుడు

సుందర్‌సింగు చెడిపోయిన చక్రం తీసేసి స్టెప్నీ బిగించి, "ఎక్కండి, హుజూర్," అన్నాడు సుశీ విజయులు కారులో ఎక్కికూర్చున్నారు.

కాని ఎంత ప్రయత్నించినా కారుఇంజను స్టార్టుకాలేదు.

"ఇంజను కేదో అయింది. బానెట్ తీసి చూస్తాను హుజూర్," అన్నాడు, సుందర్‌సింగ్ కొద్దిగా భయపడుతూ

విజయుడు వెనక్కుతిరిగి చూశాడు. రైలింజను దీపాలు ధగధగా మెరుస్తూ కనబడుతున్నాయి మోతకూడా వినిపిస్తున్నది.

సుశీ కళ్ళనీళ్ళపర్యంతమై, "బండీ వచ్చేస్తున్నది విజయబాబూ !" అన్నది

"ఏమయింది సుందర్‌సింగ్ ?" అని విజయు డడిగాడు

"చూస్తున్నాను హుజూర్. అంతా సరిగానే ఉన్నట్టున్నది మా గ్నైటోకు ఏమైనా అయిందేమో !

రైలు రానేవచ్చింది. అది వాళ్ళపక్కగానే సోహాగ్‌పూరు స్టేషనుకు వెళ్ళింది.

6

"స్టేషను అరమైలుకంటె హెచ్చుదూరం ఉండదు. స్టేషను దీపాలు కనిపిస్తున్నాయి చూడండి నెమ్మదిగా నడవగలరా ?" అని విజయుడు సుశీ నడిగాడు.

"తల తిరిగిపోతున్నది. నిలబడలేను." అన్నది సుశీ కారును ఆనుకుంటూ.

"వెళ్ళితీరాలి. మేఘాలు కమ్ముకుంటున్నాయి. వర్షం రావచ్చు. తెల్లవారేదాకా బండి మరమత్తుకాదు. ఎక్కడో ఒకచోట తల దాచుకోవాలి. స్టేషన్‌దగ్గరలో డాక్‌బంగళా ఉండవచ్చు. లేకపోయినా స్టేషన్ వెయిటింగ్‌రూమ్ ఉండనే ఉంటుంది. నా భుజంమీద బరువేసి నింపాదిగా నడవండి."

అతను సుశీని రెట్టపట్టుకుని నడిపిస్తూ బయలుదేరాడు. వాళ్లు అరమైలుదూరం నడవటానికి ఇరవై నిమిషాలు పట్టింది. చంద్రుడు పడమట అస్తమించుతున్నాడు. మబ్బులు అప్పుడప్పుడూ చంద్రుడికి అడ్డొస్తున్నాయి.

పోలీసుస్టేషను పక్కనే డాక్‌బంగళా ఉన్నది. విజయుడు బంగళా ఆవరణలోకి ప్రవేశించి ఖాన్‌సామాను కేకపెట్టాడు. జవాబులేదు. ఖాన్‌సామా ఉండే ఔట్‌హౌస్ దగ్గిర కేకపెట్టినా ఎవరూ పలకలేదు వంటఇల్లు తాళం పెట్టిఉన్నది.

విజయుడు ఒక రాయితెచ్చి, తలుపుఅద్దం పగలగొట్టి లోపలిగడియ తీసి, సుశీతో సహా లోపల ప్రవేశించాడు. లోపల బల్లా, రెండు కుర్చీలూ, డ్రెసింగ్‌టేబిలూ, ఇనపమంచమూ, దానిమీద పరుపూ ఉన్నాయి. గోడన లాంత రున్నది. విజయుడు దాన్ని వెలిగించాడు. మంచంపైన ఉన్న పరుపునిండా ధూళి. స్నానాలగదిలో ఖాళీ కడవ లున్నాయి. ఒక్కచుక్క నీరులేదు. అతను సుశీని అక్కడే ఉండమని రైలు స్టేషనుకు వెళ్ళి, కూలీలను మాట్లాడాడు. తినటానికి రొట్టె, వెన్నా, గుడ్లూ, టీ ఆర్డ రిచ్చాడు. కూలీలు వచ్చి గదులు శుభ్రంచేశారు.

ఇద్దరూ ఒళ్ళు కడుక్కుని టీ తాగటానికి కూర్చునేసరికి మూడున్నర అయింది ఇద్దరూ టీ పూర్తి చేశారు.

"ఇక మీరు వెళ్ళి పడుకోండి," అన్నాడు. మేఘాలు మెరుస్తూ గర్జిస్తూన్నాయి.

సుశీ చెయ్యి చాచి "గుడ్‌నైట్ !" అన్నది

విజయు డామె చేతిని పట్టుకుని, "గుడ్‌నైట్ ! గుడ్ మార్నింగ్ అంటేనే బాగుంటుందేమో !" అన్నాడు.

సుశీ ఆందోళనపడుతూ, "విజయబాబూ, ఉదయం లెచేసరికి మీరు కనిపిస్తారా?"

"ఎందుకు కనపడనూ?"

"ఎమైనా — వెళ్ళిపోరా?"

"మిమ్మల్ని ఇక్కడ విడిచి వెళ్ళిపోతానా? వెళ్ళను. సుశీలా! నన్ను నమ్మవచ్చు."

ఈలోకంలో నా కింకెవరూ లేరు. నన్ను విడిచిపెట్ట నననండి."

"విడిచిపెట్టను, సుశీలా! విడిచిపెట్టను!"

హోరున వర్షం ప్రారంభ మయింది. కిటికీలోనుంచి చల్లని గాలి కొట్టింది.

సుశీ నెమ్మదిగా వెనక ఉన్న పడకగదిలోకి వెళ్ళిపోయింది.

ఖాన్‌సామా నిజాముద్దీన్ తెల్లవారి వచ్చి, రాత్రిబండికి ఏ దొరో వచ్చినట్టు తెలుసుకుని భయపడ్డాడు.

వాడు మొదట విజయుడి గదిలోకి తొంగిచూశాడు. మేజోడుపాదాలు మాత్రమే కనుపించాయి. వచ్చినవాడు తెల్లదొరో, నల్లదొరో తెలియలేదు. వాడు సుశీ గది కిటికీవద్దకు వచ్చి రెక్కలతలుపు తెరిచేసరికి, లోపలనుంచి "ఎవరది?" అని ఆడకంఠం కేక పెట్టింది.

"హజూర్, ఖాన్‌సామాను టీ ఎన్నిగంటలకు తెమ్మంటారో కనుక్కుందా మని —" అన్నాడు నిజాముద్దీన్.

"ఇప్పుడు కాదు."

నిజాముద్దీన్ కాస్త మంచి దుస్తులు వేసుకుని వచ్చేసరికి విజయుడు కిటికీ తలుపులు తెరిచి వాణ్ణి చూసి, "ఎవరు నువు?" అని అడిగాడు.

"హుజూర్, ఈ బంగళాలో ఉండే ఖాన్‌సామాను," అన్నాడు నిజాముద్దీన్ వాడు రాత్రి బయటికి వెళ్ళినందుకు క్షమాపణ చెప్పుకున్నాడు.

"టీ తీసుకురా అవతలి గదిలో మేమ్‌సాబ్ బయటికి రాగానే ఛోటాహజ్రీకి ఆర్డరిస్తాను." అన్నాడు విజయుడు. అతను మొహం కడుక్కుంటూ ఉంటే ఖాన్‌సామా వరండాలో టీ ఏర్పాట్లు చేశాడు.

మరో అరగంటకు సుశీ లేచి, స్నానం చేసి, ఎనిమిదిగంటలు కావస్తుండగా వరండాలో కొచ్చింది. టీబల్లదగ్గి రున్న ఖాన్‌సామాను, "వా రేరీ?" అన్నది.

"అరగంట క్రిందట స్టేషనుకు వెళ్ళారు," అన్నాడు ఖాన్‌సామా వాడు ఛోటా హజ్రీ తెస్తానని వెళ్ళాడు

సుశీ బల్లదగ్గిర కూర్చుని, ఒకవేళ విజయుడు ఏ రైలైనా ఎక్కిఉంటాడా అనుకుని, అత నలా చెయ్యడని రూఢి చేసుకున్నది. ఆమె ఛోటాహజ్రీ తింటూం

డగా విజయుడు తిరిగి వచ్చి, "గుడ్‌మార్నింగ్, నిద్ర పట్టిందా? తలనొప్పి రాలేదు గదా ?" అని అడిగాడు.

"నిద్ర పట్టింది. ఐదింటికే లేచారట, ఎక్కడికి వెళ్ళారు ?" అన్న దామె.

"కారు ఎంతకీ రాకపోతే స్టేషనుకు వెళ్ళి కూలీలను పంపాను."

విజయుడి ఆలోచన మధ్యాహ్నంకల్లా మోటారు బాగుచేసి జబల్పూరుకు తిరిగి పోవచ్చునని. కాని మోటారుకు పెద్ద రిపేరయ్యే పక్షంలో చిక్కే.

సుందర్‌సింగు కారును ఎద్దులబండికి కట్టి లాగించుకుంటూ వచ్చాడు వెంట స్టేషను కూలీలు కూడా ఉన్నారు. వాళ్ళు కారును గేటువద్ద ఎద్దులబండినుంచి విప్పి బంగళా ఆవరణలోకి తీసుకువచ్చారు. విజయుడు వాళ్ళకు డబ్బు లిచ్చి పంపాడు.

కారుకు పెద్ద మరమ్మతే ఉన్నదనీ, జబల్పూర్ ఫోర్డులో ఉండే పీటర్ అనే మెకానిక్‌ను పిలిపిస్తే బాగుంటుందనీ సుందర్‌సింగ్ అన్నాడు.

"కారును బంగళా గరాజ్‌లో ఉంచి, నీవు బజారుకు వెళ్ళి భోంచేసి, ఒంటి గంట బండిలో జబల్పూరు వెళ్ళి పీటర్‌ను వెంటబెట్టుకురా," అన్నాడు విజయుడు.

వా ళ్ళిద్దరూ టీ తాగి ప్రశాంతంగా ఉన్న స్టేషన్ ప్లాట్‌ఫారంమీద కబుర్లు చెప్పుకుంటూ షికారు చేశారు.

రాత్రి భోజన మైన తరవాత విజయుడు తన గదిలోకి వెళ్ళి దుస్తులు మార్చి ధోవతి కట్టుకు వచ్చాడు.

ఇద్దరూ బయట కూర్చుందా మనుకుంటుండగా టెలిగ్రాం వచ్చింది. విజయుడికి సుందర్ సింగ్, పీటరుకు మూడురోజులదాకా తీరదనీ, బేహరా బయలుదేరి వస్తున్నా డనీ తంతి ఇచ్చాడు.

నిజాముద్దీన్ రెండు పడకకుర్చీలు తెచ్చి బయట వేస్తూ, రాత్రికి తనకు సెల విన్వ మని విజయుణ్ణి కోరాడు. విజయుడు సరేనన్నాడు. అతను సుశీతో, "ఏం చేస్తాం మూడు రోజు లిక్కడ ? కారును రైలెక్కించి మనం జబల్పూరు పోదామా?" అన్నాడు.

"వద్దు విజయబాబూ. మళ్ళీ అదేబంగళాలోనా ?" అన్నది సుశీ.

"సరే. అయితే ఇక్కడే ఉందాం."

ఒక పావుగంటసేపు ఎవరి ఆలోచనలో వా రుండిపోయారు. సుశీ ఏడుస్తున్నట్టు విజయుడు గ్రహించి, ఆమెకేసి చూసి, "ఏమి టది, సుశీలా ? ఏడవటం దేనికీ ? వెళ్ళిపోయినవాడికోసమా ? అత నందుకు తగడు, విశ్వాసఘాతకుడు !" అన్నాడు.

"అందు కేడుస్తానా ?"

"మరెందుకు, సుశీలా ? చెప్పవూ ?"

"రెండురోజులుగా మీ జీవితమంతా తల్లకిందులు చేశాను. మీ కెంతశ్రమ ఇచ్చాను; ఇంకెంత ఇస్తానో అని తలుచుకుంటే ఏడు పొచ్చేసింది."

"ఎందు కొచ్చిన ఆలోచన లివి! సమయానికి దగ్గిర ఉండి, కాస్త ఆదుకున్నావు నే నుండగా నీకేచిక్కూ రాదని నమ్ము సుశీలా !"

"ఇవాళ నన్ను ఒకేతీరున సుశీల అని పిలుస్తున్నా రేమిటి ?"

విజయుడు చకితుడై, "అన్నట్టు నీపేరు సుజన్నా కాదూ ?" అన్నాడు.

"ఇకనుంచీ నాపేరు సుశీలే — మీరు పెట్టినపేరు." అన్నది సుశీ.

7

మర్నాడు విజయుడు నిద్ర లేచి తలుపులు తెరిచేసరికి, వరండాలో సామాన్లు పేర్చిఉన్నాయి. లక్ష్మణబేహరా ఎర్రకంబళీమీద పడుకుని నిద్రపోతున్నాడు. విజయు డతన్ని పిలిచి లేపాడు.

తాను రాత్రి రెండుగంటల బండిలో వచ్చా ననీ, జబల్పూరు డాక్ బంగళాలో బిల్లు చెల్లించిన రశీదు తెచ్చా ననీ బేహరా అన్నాడు. విజయుడు బంగళాలో మూడున్నరరోజు లున్నాడు, పాల్ దంపతులు ఎనిమిదిరోజు లున్నారు. రెండు బిల్లులకూ రశీదు ముట్టింది. అందుకే బేహరా సుశీ సామాన్లుకూడా తీసుకురా గలిగాడు.

ఖాన్‌సామా విజయుడికోసం టీ పెట్టేసి వెళ్ళిపోగానే. సామాన్లు లోపల సర్దుతున్న బేహరా బయటికి వచ్చి, "హుజూర్, 'ఒక రహస్యం. పాల్‌సాబ్ ఎక్కడికీ వెళ్ళలేదు. జబల్పూరులోనే ఉన్నాడు," అన్నాడు.

"ఎవరు చెప్పారు ?" అని విజయు డాశ్చర్యంతో అడిగాడు

"నా కళ్ళతో నేనే చూశాను. నిన్న సుందరుసింగు అక్కడికి తిరిగివచ్చి. తొమ్మిదిగంటల బండిలో సామాన్లతోసహా బయలుదేరమని చెప్పాడు. నేను బజారుకు వెళ్ళి భోజనం చేసి తిరిగివస్తుంటే, ఎనిమిది గంటలప్పుడు, పాల్‌సాబ్ సారాదుకాణంనుంచి తూలుతూ బయటికి రావటం కనబడింది. నా కళ్ళను నేనే నమ్మలేక, ఆయనవెంట నడిచి వీధిదీపం వెలుతురులో స్పష్టంగా చూశాను; పాల్‌సాబే!"

"ఆయనకు నువు కనిపించావా ?"

"ఆయన తూలుతూ, పాడుకుంటూ పోతున్నాడు. నన్ను చూడలేదు. కోచ్ బళ్ళుండేచోటికి పోయి బండిని రమ్మంటే బండివాడు డబ్బున్నదా అని అడిగాడు. ఆయన కోటుజేబు ఆడిస్తే రూపాయలు గలగల్లాడాయి. బండి పోర్టు కేసి వెళ్ళింది. నేను బంగళాకు వచ్చాను."

"సరే, ఈమాట ఇప్పు డెవరికీ చెప్పకు," అన్నాడు విజయుడు.

అతను సిగిరెట్టుమీద సిగిరెట్టు వెలిగిస్తూ తీవ్రంగా ఆలోచించాడు. పాల్ జబల్పూరులోనే ఉన్నాడన్న మాట. సుశీ అతన్ని ముఖాముఖి చూడాలన్నది. ఆమెను జబల్పూరు తీసుకుపోతే? తీసుకుపోతే ఆమెకు మరో అవమానం జరుగుతుందేమో ?...

సుశీ స్నానం చేసి బయటికి వచ్చింది. విజయుడు కుర్చీలోనుంచి లేచి, చెయ్యి చాచి, 'గుడ్‌మార్నింగ్' అన్నాడు.

సుశీ అతని చెయ్యి అందుకుని, 'గుడ్‌మార్నింగ్' అన్నది. బేహరా తన సామానులుకూడా తీసుకుని వచ్చాడని తెలిసి ఆమె లోపలికి వెళ్ళి తన వస్తువులు చూడసాగింది. విజయుడు ఛోటాహాజ్రీ పట్టుకురమ్మని బేహరా ద్వారా ఖాన్ సామాకు కబురు చేశాడు.

ఛోటాహాజ్రీ వచ్చింది. భోజనం చేస్తూ వా రిద్దరూ ఎవరి ఆలోచనలో వా రున్నారు.

తాను ఒక్కడే వెళ్ళి పాల్‌తో మాట్లాడితే ఎలా ఉంటుంది? పాల్ తన భార్యను ఏలుకుంటా నంటేమాత్రం ఆమె ఏం సుఖపడుతుంది? అన్న వస్త్రాల కోసం భర్తకింద పడిఉండటాని కామె హిందువుకాదు. చదువుకున్న మనిషి. ఏ ఆడపిల్లల బడిలోనో పంతులమ్మపని చేసుకోవచ్చు. పాల్‌వంటి నీచుడితో

కాపరంకన్న అదే మేలు. కాని పని దొరికేదాకా ఎక్కడ ఉంటుంది? తమ యింట్లో ఉంటే? బకురాణి ఒప్పుకుంటుందో ఒప్పుకోదో? ఇలా ఆలోచిస్తున్నాడు విజయుడు.

"విజయబాబూ, ఓసారి ఇలా వస్తారా?" అని సుశీ పిలిచేసరికి విజయు డామె కంఠస్వరానికి ఉలికిపడి లోపలికి వెళ్ళాడు, "ఏమయింది?" అంటూ.

బల్లమీద తెరిచివున్న పెట్టెవద్ద నిలబడి, "ఇందులో ఉండే నా నెక్లెస్ కనిపించటంలేదు. ఎవరో కాజేశారు?" అన్నది

"ఎవరు?" అన్నాడు విజయుడు.

"ఇంకెవరు?" ఆయనే! అది మా అమ్మది; చనిపోతూ నా కిచ్చింది. దాన్నికాస్తా ఎత్తుకుపోయాడు," అంటూ సుశీ ఏడవసాగింది. అది తనభర్త చేసినపనే ననటానికి ఆమెకు ఆధారం ఉన్నది పాల్ వెళ్ళిపోయేరోజు సాయంకాలం టీ తాగేటప్పుడు, చేతిరుమాలుకు సెంటు రాచుకుంటానని ఆమె తాళంచెవ్వ డిగి పుచ్చుకున్నాడు. అప్పుడే అతను నెక్లెస్ హరించిఉండాలి

"పోలీసులకు దొరికేపని చేశాడే!" అన్నాడు విజయుడు.

"పోలీసులకు చెబితే ఆయన్ను పట్టుకుని, జైల్లో పెడతారా విజయబాబూ?" అన్నది సుశీ.

"ఆయన దొరకాలి, నేరం రుజువుకావాలి."

"అయితే పోలీసులకు రిపోర్టియ్యండి. ఆ సైతాన్ను జైల్లో పడవియ్యండి నా జీవితమంతా ధ్వంసం చేసినవాడి కదే తగినశిక్ష"

"నిజమేకాని, ఇందులో ఇంకా తిరుగుళ్ళున్నాయి. నే చెప్పేనదంతా విన్నమీదట ఏం చెయ్యాలో ఆలోచింతాం. వరండాలో కూచుని మాట్లాడుకుందాం"

సుశీ రుమాలుతో కళ్ళు తుడుచుకుని, పెట్టె మూసేసింది.

ఇద్దరూ వరండాలో కుర్చీలలో కూర్చున్నారు

"చూడు, సుశీలా; పాల్ బొంబాయి వెళ్ళలేదు జబల్పూరులోనే ఉన్నాడు. నిన్నరాత్రికూడా అక్కడ కనిపించాడు,' అన్నాడు విజయుడు.

"ఉన్నాడా? ఎవరు చెప్పారు?"

"లక్ష్మణ బేహరా ఆయన్ని చూశాడు," అంటూ విజయుడు తనతో బేహరా చెప్పిన వివరాలన్నీ ఆమెకు చెప్పాడు

"ఇంకేం, నెక్లెస్ అమ్మేసి డబ్బు జేబులో వేసుకున్నాడు. ఆరునెల్ల ఈ మధ్య ఆయన జేబులో రూపాయలు గలగల్లాడిం దెప్పుడు?" అన్నది సుశీ ఆమె కళ్ళ

వెంట మళ్ళీ అశ్రుధార బయలుదేరింది. "నా నెక్ లెస్ నాకు దొరికే ఉపాయం ఏమీ లేదా, విజయబాబూ?" అన్న దామె.

"పోలీసుల సహాయంతో దొరికితే దొరకవచ్చు. కాని పాల్ జైలుకు పోవలసి వస్తుంది."

"ఆయన కదే జరగాలి."

"అయినా ఆయన నీ భర్త నువే సాక్ష్యం ఇచ్చి ఆయనను జైలుకు పంపటమంటే ___"

"చాలా తప్పా?" భర్త దేవుడనుకోవటానికీ, ఆయన చంపినా ఊరుకోవటానికీ నేను హిందూస్త్రీని కాను, విజయబాబూ!"

"నే నలా అనలేదు. ఆయన పశ్చాత్తాపపడి క్షమాపణ చెప్పుకుంటే మీ కిద్దరికీ రాజీ కుదరవచ్చు."

"క్షమించండి విజయబాబూ. ఇక రాజీ అన్నది లేదు; జరిగింది చాలు. ఒక సారి గోతిలో పడ్డాను. ఇంకోసారి పడను."

"ఆయన చెయ్యవలసిన అపకార మేదో చెయ్యనే చేశాడు. కేసు పెట్టిన మాత్రాన అది పోదు. పత్రికలో రిపోర్టులూ, అపఖ్యాతీ, అపహాస్యంపాలు కావటమూ తప్ప ఇంకేమీ ఉండదు."

పత్రిక అనేసరికి సుశీ కొంచెం తగ్గి, పోనీ, మి కిష్టంలేకపోతే మానేద్దాం. అయితే ఆయన ఇంకా జబల్పూరులోనే ఉన్నా డంటారా?" అన్నది

"వెళ్ళి చూద్దామా?"

"అందుకే బెంగపెట్టుకుని ఉన్నాను."

సుశీ కొంచెం ఆగి, "ఏమి టాలోచిస్తున్నారు?" అన్నది.

"పాల్ జబల్పూరులోనే ఉంటే నేను వెళ్ళి నెక్ లెస్ సాధించుకు రాగలనా?" అని ఆలోచిస్తున్నాను.

సుశీ మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. ఇద్దరూ ఆ విషయమే మాట్లాడు కున్నారు.

విజయుడు ఒంటిగంట బండిలో జబల్పూరు బయలుదేరాడు

"నెక్ లెస్ దొరికినా, దొరక్కపోయినా మీరు త్వరగా తిరిగిరండి," అన్నది సుశీ.

"సాధ్యమైతే రేపే వస్తాను. ఏపరిస్థితిలోనూ ఎల్లుండి దాటదు," అన్నాడు విజయుడు.

మధ్యాహ్నం భోజనా లయాక ఖాన్ సామా నిజాముద్దీన్ సుశీకోసం ఒక ఆయాన

తెచ్చాడు ఆమె కొక ఆయాను ఏర్పాటుచేస్తే సౌకర్యంగా ఉంటుందనుకుని విజయుడు ఆరోజు ఉదయమే నిజాముద్దీన్‌ను హెచ్చరించాడు. నిజాముద్దీన్ తెచ్చిన ఆయా పేరు అమీనా. ఆమె హైదర్ అనే రైల్వే పనివాడి చెల్లెలు.

"మేమ్‌సాబ్‌కు పిల్లలెందరు ?" అని అమీనా అడిగింది.

"ఇంకా పెళ్ళి కాలేదు. ప్రస్తుతం మనిద్దరిలాగే వాళ్ళు ఉన్నారు. పెళ్ళిమాట నిశ్చయమయిందిట. కలకత్తా వెళ్ళి చేసుకుంటారుట. చాలాకాలంగా ఒకరినొకరు ప్రేమిస్తున్నారుట. వాళ్ళ పెళ్ళికి మేమ్‌సాబ్ తండ్రి మొదట అభ్యంతరం చెప్పాట్ట. మేమ్‌సాబ్ తల్లిదగ్గర ఏడిస్తే చివరకు తండ్రి సరేనన్నాట్ట. ఇద్దరూ దేశయాత్ర చేస్తున్నారు. ఇంకోనెలలో వాళ్ళు కలకత్తా వెళ్ళి పెళ్ళి చేసుకుంటారు," అన్నాడు నిజాముద్దీన్.

నిజానికి ఇది అతని కల్పనకాదు అతను గుచ్చి గుచ్చి అడిగితే లక్ష్మణబేహరా ఈ కట్టుకథ చెప్పి తృప్తి కలిగించాడు.

సుశీ స్టేషనుకు వెళ్ళి విజయుణ్ణి ఒంటిగంట బండి ఎక్కించి, తిరిగివచ్చి తన గదిలో పడకకుర్చీలో చేరగిలబడి, కళ్ళు మూసుకుని కంటతడి పెట్టుకోసాగింది. కొంతసేపయాక తన నెవరో తాకినట్టయి, సుశీ కళ్ళు తెరిచి ఆయాను చూసింది. ఆమె కాలిజోళ్ళు మారుస్తా నన్నది ఆయా. సుశీ సరే నన్నది.

"మేమ్‌సాబ్ !"

సుశీ కళ్ళు తెరిచింది.

"దిగులుపడకండి మేమ్‌సాబ్. భర్తలు ఎక్కడికీ వెళ్ళకుండా జరుగుతుందా," అన్నది ఆయా.

సుశీ కళ్ళు పెద్దవి చేసి, "భర్త ఎవరు ?" అన్నది.

"క్షమించండి. ఇంకా మీరు భార్యాభర్తలు కాలేదని నాకు తెలుసు ననుకోండి. ఇవాళ కాకపోతే రేపు కారా ? ముల్లా వచ్చి కల్మా చదవనంతమాత్రాన మీరు భార్యాభర్తలు కాకపోతారా, మేమ్‌సాబ్ ? అల్లా ఒకరిమీద ఒకరికి ప్రేమ ఎప్పుడైతే కలిగిస్తాడో అప్పుడే వారు భార్యభర్తలు," అన్నది ఆయా

8

జబల్పూరులోని పంజాబీల సత్రంలో సుందర్‌సింగు తన భోజనం తయారు చేసుకుంటూ, నీళ్ళకోసం వీధిపక్కన ఉన్న కుళాయి దగ్గిరికి వచ్చేసరికి, ఎవరో అతన్ని పేరుపెట్టి పిలిచారు. అతను తలఎత్తి చూసేసరికి పాల్, చేతిలో బాగూ, నోట్లో సిగిరెట్టూ పట్టుకుని, నవ్వుతూ ప్రత్యక్ష మయ్యాడు. బేహరా పాల్‌ను

చూసినాక తిరిగి సుందరుసింగును కలవలేదు. అందుచేత సుందరుసింగుకు పాల్ జబల్పూరులో ఉన్న సంగతి తెలియదు.

"సాబ్, మీరు బొంబాయి వెళ్ళలేదా ?" అన్నా డతను.

పాల్ సుందరుసింగుద్వారా అన్ని సంగతులూ తెలుసుకున్నాడు. తాను మెకానిక్ పీటరును సోహాగ్‌పూరు తీసికునిపోయి కారు మరమ్మతు చేయించాలనీ. కారు బాగయాక విజయుడు జబల్పూరు వస్తాడో, తిన్నగా కలకత్తాకే వెళతాడో తనకు తెలీదనీ సుందరసింగు పాల్‌తో అన్నాడు.

పాల్‌కు ఉండటానికి సరయిన చోటు దొరుకలేదు. తాను పారిపోయి దాక్కున్న మర్నాడు విజయుడూ, సుశీ కారులో వెళ్ళినట్టు విని అతను నవ్వుకున్నాడు. అతను డాక్‌బంగళాకు వెళదా మనుకున్నాడు గాని, వా ళ్ళిద్దరూ ఏ క్షణాన తిరిగివస్తారో అని భయపడ్డాడు. వాళ్ళు మరిమూడురోజులదాకా రారని ఇప్పుడు రూఢిగా తెలియటం చేత, అత నా సాయంకాలం నిశ్చింతగా తన సామానుతో డాక్‌బంగళాకు వెళ్లాడు.

"సాబ్ ఎన్నా ళ్ళుంటారు ?" అని ఖాన్‌సామా అడిగాడు.

"ఒక్కరోజు. రేపు సాయకాలం బండికి వెళ్ళిపోతాను "

"మీరు ఎనిమిది రోజుల ఎకౌంటు —

"ఆ బిల్లుపైకం బోసుగారి కిచ్చానే ! ముట్టలేదా ?"

"ముట్టిందిలెండి. వారి జేబులోనుంచి ఇచ్చినట్టు విన్నాను."

"వారి జేబైతే నేం. నాదైతే నేం? ఆయన నా మిత్రుడు."

"అదేమో. మీ రీసారి డబ్బు అడ్వాన్సుగా ఇవ్వవలిసిఉంటుంది "

పాల్ దర్పంగా పదిరూపాయల నోటు తీసి కింద పారేస్తూ, "మిగిలిన డబ్బుతో ఒక్క విస్కీబుడ్డీ, అరడజను సోడాలూ తెప్పించు." అన్నాడు.

అయిదుగంట లయింది. పాల్ విస్కీబుడ్డి తెరుస్తూండగా ఒకబండి బంగళా ఆవరణలోకి వచ్చింది అందులోనుంచి విజయుడు దిగాడు. ఖాన్‌సామా వచ్చి సలాం చేసి నిలబడ్డాడు

సుందర్‌సింగుకోసం అర్జంటుగా మనిషిని పంపమనీ, టీ తీసుకురమ్మనీ ఖాన్‌సామాకు చెప్పి, విజయుడు కోటు విప్పి గదిలో కొక్కానికి తగిలించి, పడక కుర్చీలో పడుకుని, పాల్‌ను పట్టుకుని, అతను నెక్‌లెస్ ఎవరి కమ్మాడో తెలుసుకోవడం గురించి ఆలోచించాడు.

ఖాన్‌సామా పళ్ళెంలో టీ, టోస్టూ, వెన్నా మొదలైనవి తెచ్చి అతని ముందు పెట్టి, సుందర్‌సింగును పిలుచుకురావటానికి మనిషిని పంపినట్టు చెప్పాడు.

విజయుడు టీ కలుపుకుని తాగుతూ, "పాల్‌సాబ్ బొంబాయి వెళ్ళలేదుట. ఇక్కడే ఉన్నాట్ట. ఎక్కడున్నదీ నీకు తెలుసా?" అని ఖాన్‌సామా నడిగాడు.

"జీ హుజూర్! ఇక్కడే—ఈ బంగళాలోనే—ఉన్నారు!"

"ఈ బంగళాలోనే? ఎప్పుడొచ్చాడు."

"మీరు వచ్చేముందే."

"ఏం చేస్తున్నాడు?"

"వెనకటి గదిలోనే విస్కీ తాగుతున్నారు రేపు సాయంకాలం బండికి బొంబాయి వెళతారుట"

విజయుడు మొహం చిట్లించి, "ఖాన్‌సామా, నేను టీ తాగేదాకా వరండాలో నిలబడి, అతను వెళ్ళిపోకుండా చూడు," అన్నాడు. అతను టీ తాగటం పూర్తిచేసి వరండాలోకి వెళ్ళి, "ఆయన ఈ పూట బయటికి పోతాడేమో కనుక్కురా. నామాట మాత్రం చెప్పకు," అన్నాడు.

ఖాన్‌సామా పాల్ గదిలోకి వెళ్ళివచ్చి, పాల్ ఎక్కడికీ వెళ్ళటంలేదని విజయుడితో చెప్పి, ఖాళీ ట్రే తీసుకుని వెళ్ళిపోయాడు.

బంగళాలో దీపాలు వెలిగించారు. సుందర్‌సింగు వచ్చాడు. అతన్ని తన గదిముందుండమని చెప్పి, విజయుడు పాల్ గదిలోకి వెళ్ళాడు. పాల్ పైప్ కాలుస్తూ, విస్కీ తాగుతూ, దీపందగ్గిర కూర్చుని ఎదో పుస్తకం చదువుతున్నాడు.

"హలో, పాల్! ఇక్కడున్నావేం?" అన్నాడు విజయుడు

పాల్ విజయుణ్ణి చూసి ఉలికిపడి, "ఓ హల్లో, మిష్టర్ బోస్!" అంటూ లేవబోయి తూలాడు. నోట్లోనుంచి పైపు జారి కిందపడింది.

"బొంబాయి వెళ్ళలేదేం?" అని విజయుడడిగాడు.

"వెళ్ళటం పడలేదు, మహాశయా!" అన్నాడు పాల్ దీనంగా.

విజయుడు కుర్చీ లాగి కూర్చున్నాడు.

"మీరు సోహాగ్‌పూర్‌లో లేరా?"

"వచ్చి అరగంట అయింది."

"సు — సు — సు —"

"మిసెస్ పాల్ సోహాగ్‌పూర్‌లోనే ఉన్నారు. నేను అర్జంటుపని ఉండి వచ్చాను. ముందు నీ విశేషాలు చెప్పు. బొంబాయి వెళుతున్నానని ఆమె కెందు కబద్ధమాడావు?"

"టైముండిగదా అని రిఫ్రెష్మెంట్ రూమ్‌కు వెళ్ళి బండి మిస్ చేశాను"



"తరవాత రెండురోజులూ కూడా వెళ్ళలేదే?"

"డబ్బు లేకపోయింది."

"అదేమిటి? ఈ రెండురోజులూ నీ జేబులో రూపాయలు గలగల్లాడుతూనే ఉన్నాయే?"

పాల్ తన జేబులోనుంచి పదిరూపాయల్ల నోటూ, కొంత చిల్లరా తీసి బల్లమీద పెట్టి "ఇదే నాకున్న సర్వస్వం. రూపాయ లెక్కడినుంచి వస్తాయి, మిస్టర్ బోస్!" అన్నాడు.

"నెక్‌లెస్ అమ్మిన డబ్బంతా అప్పుడే అయిపోయిందా," అన్నాడు విజయుడు. అతనిమాటలు తన కేమీ అర్థం కానట్టు నటించాడు పాల్.

"నీ భార్య నెక్‌లెస్ ఎత్తుకుపోయి అమ్మినసంగతి నాకు తెలీ దనుకున్నావా?"

"నా భార్యకు నెక్‌లెస్ ఎక్కడిది? మా స్థితి ఎలాటిది! ఒకజత చెవిపోగులు కొనిపెట్టలేకపోయాను. నెక్‌లెస్ కొనగలనా?"

"పాల్. నే నిక్కడికి వచ్చినపని చెబుతాను విను. నీమీద పోలీసు రిపోర్టివ్వటానికి వచ్చాను. నువు నీ భార్యకు బండివాడి ద్వారా చీటీ పంపినప్పుడు నీ దగ్గిర బండివాడుకి డబ్బులుకూడా లేవని రాశావు. ఆ తరవాత నీ జేబులో డబ్బు గలగల్లాడింది. ఇంతకుముందు ఖాన్‌సామాకు నోటిచ్చి విస్కీబుడ్డి తెప్పించావు. ఈ సంగతు లన్నీ ఇక్కడే రుజువు చేయించి నిన్ను పోలీసులకు హాండోవర్ చేస్తాను... సుందర్‌సింగ్!"

సుందర్‌సింగ్ వచ్చాడు. విజయుడతన్ని తన రైటింగ్‌పాడ్, కలమూ తెమ్మని

ఏదో రాయ నారంభించాడు. భయంతో పాల్ నిషా దిగిపోయింది. అలా వెళ్ళి అరగంటలో వస్తా నని పాల్ వెళ్ళబోయాడు.

"ఇన్‌స్పెక్టర్ వచ్చాక ఆయన అనుమతిస్తేనే నువ్వెక్కడికైనా వెళ్ళేది." అంటూ విజయు డతన్ని బలవంతాన కుర్చీలో కూర్చోబెట్టి, "లేచావంటే సుందర్ సింగుచేత నీ కాళ్ళూ, చేతుల్లూ అంటగట్టేయిస్తాను." అన్నాడు.

పాల్ నిట్టూర్చి విస్కీ గ్లాసులో పోసుకుని తాగుతూ, "బోస్, నామీద రిపోర్టివ్వకు. అందువల్ల నీకూ, సుశీకీ చాలా నష్టం" అన్నాడు.

"అదివరకు చేసిన నష్టంగాక కొత్తగా ఏం చెయ్యగలవు?"

"సుశీకి ఎంత అపకీర్తి! మీ ఇద్దరిని గురించీ పత్రికల్లో వేయిస్తాను. నువ్వు నా పడుచుభార్యతో రాత్రిల్లా కారు ప్రయాణం చేశావు? దేనికీ? సోహాన్‌పూర్‌లో మీ రిద్దరూ ఒంటరిగా డాక్ బంగళాలో ఎందుకు గడిపారూ? నన్ను పోలీసులకు పట్టిచ్చావంటే మీ సంగతంతా బైట పెడతాను. మీ ఇద్దరి చర్యా చూసి సహించలేకనే నేను నా భార్యను వదిలేశాను — అని చెబుతాను."

విజయుడికి పట్టరాని ఆగ్రహం వచ్చింది.

"పాల్, నీలాటి రాస్కెల్స్ తరఫునా, వారికి విరుద్ధంగానూ ఎన్నో కేసులు పట్టాను. నువ్విలా పేలితే ఏంజరిగేదీ నాకు తెలుసు. నిన్ను పోలీసుల కప్పగిస్తాను. నీ దగ్గిర నెక్‌లెస్ కొన్నవాణ్ణి పోలీసులు పట్టుకుంటారు. నేనే నీపైన కేసు నడిపిస్తాను." అని అతను సుందర్‌సింగును పిలిచి "ఈ ఉత్తరాన్ని ఠాణాకు తీసుకుపోయి. ఇన్‌స్పెక్టర్‌గారితో దొంగ దొరికే డని చెప్పాలి. వెంటనే కోటు వేసుకుని రా." అన్నాడు

పాల్ కుర్చీలో వెనక్కు చేరగిలబడి నిట్టూర్చి, "మీకు సుశీమీద ప్రేమ ఉన్న దనుకున్నాను. పొరపా టయింది. మిస్టర్ బోస్, మీకు లేకపోయినా నా భార్యమీద నాకు ప్రేమ ఉన్నది. ఆమె చాలా మంచిపిల్ల కావలిస్తే మీరు సుశీని తీసుకోండి నాకున్న హక్కులన్నీ వదిలేస్తూ మీకు పత్రం రాసిస్తాను." అన్నాడు.

"సుశీ నా కవసరంలేదు ఆమెక్కూడా నామీద మోహంలేదు. ఆవిడ నెక్‌లెస్ ఎవరి కమ్మావో చెప్పు. చెప్పకపోతే ఈ రిపోర్టు పోలీసులకు చేరుతుంది."

"చెబితే నన్ను పోలీసుల కప్పగించరుగద? అయితే బండి తెప్పించండి; కొన్న మనిషిని చూపిస్తాను."

"ఎంత కమ్మావా నెక్‌లేస్‌ను?"

"నూటయాభైకి. యాభై ముట్టాయి. మిగతా వంబా రే పిస్తానన్నాడు."

విజయుడు సుందర్ సింగును పంపి బండి తెప్పించి, అందులో పాల్ నెక్కించుకుని బజారుకు వెళ్ళాడు. అదృష్టవశాత్తూ కంసాలి దుకాణం ఇంకా తెరిచేఉంది. కానీ కంసాలి కొన్న ధరకు నెక్లెస్ అమ్మననీ. అదనంగా మరో వంద ఇయ్యమనీ అన్నాడు.

"అది దొంగసొమ్ము. మంచిగా ఇవ్వకపోయావో పోలీసులకు రిపోర్టిస్తాను." అని విజయుడు భయపెట్టినమీదట ఆ దుకాణంవాడు యాభై రూపాయలూ తీసుకుని నెక్లేస్ ఇచ్చేశాడు.

అతను తిరిగి బంగాళా చేరేసరికి ఎనిమిదింబా వయింది. ఖాన్ సామాను పిలిచి, రాత్రి బండికి వెళుతున్నాననీ, తొమ్మిది కొట్టేసరికల్లా భోజనం పెట్టాలనీ చెప్పి, పాల్ను తన గదిలోకి పిలిచి, "ఇక నువ్వూ, సుశీ కలిసిఉండటం అసంభవమేనా? ఆమె నెందుకు వదిలావు?" అని అడిగాడు.

నేను విస్కీ తాగినప్పుడల్లా చివాట్లు పెడుతుంది. ఇదేకాదు. నేను సుశీని వదిలిపెట్టటానికి మరో కారణంకూడా ఉంది. అది రహస్యం. చాలా రహస్యం. సుశీకి కూడా తెలీదు. మా దేశంలో నాకు భార్య ఉంది. నా ఉద్యోగం పోయిందిగదా. దమ్మిడీ లేకుండా ఇద్దరు భార్యల నెలా పోషిస్తాను చెప్పండి."

విజయు డాశ్చర్యంతో, "నీ కింకో భార్యా ఉందా? చెప్పవేం? ఆవిడ నెప్పుడు పెళ్లాడావు?"

పాల్ ఇకిలించి, గుడ్లుమిటకరిస్తూ, "నేను పెళ్లాడలేదు. మా పెద్దవాళ్ళు చేశారు. నా కప్పుడు పంతొమ్మిదేళ్ళు." అన్నాడు.

"ఆ భార్య బాగుందా?"

"పిడిరాయిలా గుంది. అది భార్యకాదు. రాక్షసి. ఆవిడ రాసిని ఉత్తరం చూడండి." అంటూ పాల్ జేబులోనుంచి ఒక కవరు తీసి ఇచ్చాడు. కలకత్తాలో కంపెనీపేర వచ్చిన ఆ ఉత్తరంమీద జబల్పూరు పోస్టుమాస్టరు కేర్ అని ఎర్రసిరాతో రాసిఉంది.

ఆ ఉత్తరం రాసిన మనిషి పేరు సోఫీ పాల్. మద్రాసులో ఒక పేటనుంచి రాసింది. తానూ, తన బిడ్డలూ తిండిలేక మాడుతున్నామనీ, డబ్బు పంపమని బతిమాలుతూనూ, నిష్ఠురంగానూ గూడా రాసింది.

"నీ భార్య బతికుండగానే మరో పెళ్ళి చేసుకున్నావేం?" అని విజయుడు పాల్ నడిగాడు.

"ఎందుకు చేసుకున్నానా? నా భార్య పరమగయ్యాళి. ఒకనాడు నన్ను కాలి జోడుతో కొట్టింది."

"తగాదా కారణం?'

"తాగొచ్చానని అది జరిగిన మర్నాడే రైలెక్కి కలకత్తా వెళ్ళి, ఉద్యోగం సంపాదించి, సుశీని చూశాను. బెంగాలీ స్త్రీలు భర్తలను భక్తిగా చూస్తారని తెలిసి, సుఖపడదామన్న ఆశతో సుశీని పెళ్లాడాను. కాని సుఖం లేకపోయింది. మహాశయా!"

పాల్‌ను చూస్తే విజయుడికి నవ్వొచ్చింది; జాలికూడా కలిగింది.

"క్రైస్తవులు పెళ్ళిమీద పెళ్ళి చేసుకుంటే చట్టం ఒప్పదు. నిన్ను సుశీ జైలుకు పంపిస్తే?" అన్నాడతను.

"అసలైన క్రైస్తవులు రెండు పెళ్ళిళ్ళు చేసుకోరాదన్నది నిజమే. కాని మేం హిందూక్రైస్తవులం. మా జాతివాళ్ళు గుడికి వెళ్ళి పూజ చేస్తారు. ఆదివారంనాడు చర్చికి వెళతారు. బొట్టు పెట్టుకుంటారు." అన్నాడు పాల్.

"మీకు జరిగింది క్రైస్తవ వివాహమేనా?"

"అవును"

"ఏ చర్చిలో?"

"మద్రాసు బాప్టిస్టు చాపెల్‌లో. 1907 నవంబరు 6 న. అయినా మేం హిందూ క్రైస్తవులం కావటంచేత ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోవచ్చు."

"లాభంలేదు పాల్. మీరు బొట్లు పెట్టుకున్నా, గుళ్ళకు వెళ్ళినా చట్టం బాధించదు గాని, పెళ్ళిమీద పెళ్ళిమటుకు చెల్లదు."

పాల్ భయపడ్డాడు. అతను విజయుడి చెయ్యి పట్టుకుని. ఈసంగతి సుశీకి చెప్పవద్దనీ తనను జైలుకు పంపవద్దనీ బతిమాలుతూ, బావురుమన్నాడు. విజయుడతనికి అభయమిచ్చి, వెళ్ళిపడుకోమన్నాడు. పాల్ వెళ్ళిపోయాడు.

విజయుడు పాల్ మొదటిపెళ్ళి జరిగిన తేదీ వగైరాలు గుర్తుగా రాసుకుని, భోజనం చేసి. తొమ్మిదీయాభై ఆరు బండికి సోహాగ్‌పూర్ బయలుదేరాడు.

9

రాత్రి రెండున్నరగంటలప్పుడు ఆయాఅమీనా సుసీని లేపి, "సాబ్ వచ్చారు!" అని చెప్పింది. సుసీ పక్కమీదనుంచి లేచి జుట్టూ, బట్టా సవరించుకుని విజయుడి గదికి వెళ్ళేసరికి, బేహరా టీ కాచటానికి స్టౌ వెలిగిస్తున్నాడు.

"నీకు నిద్రాభంగం కాకూడదని ఎంతో జాగ్రత్తపడ్డాను. లేవనేలేచావే?" అన్నాడతను.

"ఏమయింది విజయ్?" అన్నదామె

విజయుడు జేబులోనుంచి నెక్లేస్ తీసి సుశీమెడలో పెట్టాడు. సుశీ ఆనందానికి మేరలేదు "మొత్తానికి తెచ్చారే? ఎలా తెచ్చారో చెప్పరూ?" అన్నది. ఆమెను కూర్చోబెట్టి విజయుడు తాను చెప్పదలచుకున్నదంతా చెప్పాడు.

సుందర్‌సింగు పీటరును వెంటబెట్టుకుని జబల్పూరునుంచి రాగానే కారురిపేరీ ఆరంభమయింది.

విజయుడు సుశీ భవిష్యత్తుగురించి చాలా మాట్లాడాడు, కాని పాల్ మొదటిపెళ్ళి గురించి ఏమీ చెప్పలేదు. పాల్ అబద్ధమాడవలసిన కారణ మేమీలేదు. అయినా ఆపెళ్ళి అయినట్టు నమ్మకంగా తెలిసేదాకా సుశీకి చెప్పటం అంత మంచిదికా కనిపించింది

* * * *

విజయుడు తన భార్యకు ఉత్తరం రాస్తూండగా ఆయా వచ్చి సుశీ రమ్మంటున్న దని చెప్పింది. ఉత్తరం రాయటం ఆపి, ఇల్లు కదిలి రావటం పొరపాటయిం దను కుని క్షణంసేపు చింతించి, అతను లేచి సుశీపద్దకు వెళ్ళాడు

"నాకోలా అనిపిస్తున్నది." అన్నది సుశీ. ఇద్దరూ కూర్చున్నాక "ఈ స్థితిలో నేను వచ్చి మీ యింట ఉండటం బాగుంటుందా అని; నా మనస్సు అయోమయంగా ఉంది."

అతని మనస్సూ అయోమయంగానే ఉంది. ఆమె వచ్చి తనయింట ఉంటే తనవాళ్ళెవరైనా ఆమెను అవమానపరచవచ్చు. బకురాణీ అలా ఎన్నటికీ చెయ్యదు. కాని ఇంట్లో ఉన్న ఇతరులమాట? దిక్కులేక తమఇంట తలదాచుకున్న మనిషిని ఆడవాళ్ళు తమకన్న హీనంగా చూడటం సహజం.

"ఇం కెక్కడికి పోదా మనీ?"

"బర్మాలో మా చిన్నాన్న ఉన్నారు; వీలుంటే అక్కడికి పోదా మని. కలకత్తా చేరాక ఆయనకు ఉత్తరం రాస్తాను."

"సొంత దేశాన్నీ, సొంత మనుషులనూ విడిచి బర్మా పోవట మేమిటి? పెళ్ళికి ముందు మీ నాన్నగారి స్నేహితుడింట ఉన్నట్టు చెప్పావే? ఆయన పే రేమిటి? ఎక్కడుంటారు?"

"జోసెఫ్ చౌధరీ. జోడాగిర్జా దగ్గరలో ఉంటారు."

"అక్కడికి వెళ్ళి కొంతకాలం ఉంటే ?"

"వెళ్ళి వాళ్ళతో ఏం చెప్పను ?" అన్నది సుశీ వాడిపోయిన ముఖంతో.

"ఒకపని చేద్దాం కలకత్తా చేరగానే నువు గ్రేట్ ఈస్టర్న్ హోటల్లోనో, స్పెన్సర్ హోటల్లోనో దిగుదువుగాని. నేను జోసెఫ్ చౌధురీగారివద్దకు వెళ్ళి సంగతంతా చెబుతాను. తరవాత విషయం తరవాత ఆలోచింతాం."

సుశీకి ఈ ఆలోచన బాగా నచ్చింది.

వా రిద్దరూ టీ తాగుతూండగా గరాజ్‌నుంచి మోటారుఇంజను ఆడిన చప్పుడు వినిపించింది విజయుడికి చాలా ఉత్సాహం వచ్చింది. సుందర్‌సింగ్ కారును గరాజిలోనుంచి వరండా మెట్లదగ్గిరికి తీసుకువచ్చి, "బండి బాగయింది. హుజూర్," అన్నాడు.

*　　　*　　　*　　　*

బొంబాయి మెయిలు హౌరా స్టేషను చేరింది. సుశీ, విజయుడూ అందులో నుంచి దిగారు.

"మీకోసం ఎవరూ స్టేషనుకు రాలేదేం ?" అన్నది సుశీ.

"నేను వస్తున్నట్టు ముందుగా ఇంటికి కబురు చెయ్యలేదు," అన్నాడు విజయుడు. అతను తన సామానంతా లక్ష్మణబేహరాతో బండిలో ఇంటికి పంపి, సుశీని గ్రేట్ ఈస్టర్న్ హోటలుకు తీసుకువెళ్ళాడు. అక్కడ ఆమెకు గదీ, ఆయా మొదలైన ఏర్పాట్లు చూసి అతను, "ఇక నేను ఇంటికి పోతాను మళ్ళీ సాయంకాలం వస్తాను. చౌధురీగారిని గురించి వాకబు చేస్తాను," అన్నాడు

హోటలు నౌకరు ఒక పెద్ద బౌండు పుస్తకం తెచ్చి అందులో సుశీని ఆమె పేరూ, చిరునామా రాయమన్నాడు. విజయుడా పుస్తకాన్ని తీసుకుని అందులో, "మిస్ సుశీలా దే !" అని రాశాడు

నౌకరు వెళ్ళాక సుశీ, "అదా నా పేరు ?" అన్నది

"అవును. ఇకనుంచీ నీ పేరు మిస్ సుశీలా దే ! నేను వెళ్ళొస్తాను. సాయంకాలం నాలుగూ, అయిదూ మధ్య వస్తాను." అన్నాడు విజయుడు.

"నేను బకురాణీని కలుసుకునే దెప్పుడు ?"

"ఇంటికి వెళ్ళి ఆలోచిస్తాను"

అతను టాక్సీ ఎక్కి, సుశీకి చెయ్యి ఊపి, వెళ్ళిపోయాడు ఆయా వచ్చి సుశీని స్నానానికి పిలిచింది

రెండవ భాగం

1

రాత్రి పన్నెండు దాటింది. వకుళమాల తన పడకగదిలో బల్లవద్ద కూర్చుని ఉత్తరం రాస్తుండగా ఆమె అడబిడ్డ సౌదామిని అక్కడికి వచ్చి, "ఎంతయిందో తెలుసా? ఈవేళప్పుడీ రాత లేమిటి? పడుకో వదినా!" అన్నది.

"నన్ను పడుకోమంటున్నావు. నువ్వెందు కింతదాకా మేలుకుని ఉన్నావు?" అని వకుళ ఆమె నడిగింది.

"నాకు నిద్రపట్టలేదు. డాబామీద కాస్త తిరుగుదామని పోతుంటే నీ గదిలో దీపం కనిపించింది." అన్నది సౌదామిని.

"నాకూ నిద్ర పట్టకనే ఉత్తరం రాద్దామని కూర్చున్నాను."

"అయితే నువ్వుకూడా మేడమీదికి రా. చల్లగాలిలో తిరుగుదాం."

పక్కనే ఉయ్యాలలో నిద్రపోతున్న చిట్టికి అటూ ఇటూ దిళ్ళు పెట్టి, ఫాన్ విసురు కాస్త తగ్గించి వకుళమాల సౌదామినివెంట మేడమీది డాబాకు వెళ్ళింది.

"ఇంత చీకట్లో ఏం కనపిస్తుందని డాబామీదికి వస్తావు?" అని వకుళ సౌదామిని నడిగింది.

"నాకు చీకట్లోనే వెలుతురు కనిపిస్తుంది; నీకు పట్టపగలు చీకటి కనపళ్ళేదూ?" అన్నది సౌదామిని.

"అదెప్పుడు?"

"జ్ఞాపకం చేసుకో. అన్నయ్య సుశీలను వెంటబెట్టుకుని సోహాగ్‌పూర్ వెళ్ళానని రాసినప్పుడు ఏమైనా ఆ వ్యవహారం నాకంతగా నచ్చలేదు."

"నచ్చటానికి ఏమంత మంచిసంగతనీ!"

"నీ కెలా తోస్తున్నది. అన్నయ్య మనసు ఆవిడవేపు మొగ్గిఉంటుందా?"

"ఆవిడ మనసు ఆయనకేసి బాగా మొగ్గింది."

"ఎలా తెలుసు?"

"వాళ్ళు ఒకరినొకరు మీరు అనటం మానేసి నువ్వు అనుకో నారంభించారు. మీ అన్నయ్య రాసిన ఉత్తరంలో వాళ్ళు అలా మాట్లాడుకున్నట్టే ఉన్నది."

ఇద్దరూ "విషవృక్షం"లోని పాత్రలను జ్ఞాపకం చేసుకున్నారు. ప్రస్తుతం సుశీ కుందనందిని, సౌదామిని కమలమణి, వకుళమాల సూర్యముఖి!

ఒంటిగంట కొట్టాక ఇద్దరూ మేడ దిగి కిందికి వెళ్ళి పడుకున్నారు

తెల్లవారాక లక్ష్మణబేహరా సామానుతోసహా ఇంటికి చేరాడు. నౌకర్లు కంగారు పడ్డారు. బాబుగారు వస్తారని వాళ్ళు తమ పనులను గురించి. అశ్రద్ధగా ఉన్నారు.

వకుళమాల నిద్ర లేచేసరికి ఏడున్నర అయింది ఆమె అద్దంముందు విలబడి జుట్టు సవరించుకుంటూండగా సౌదామిని వచ్చి, "అన్నయ్య వచ్చాడు." అన్నది

వకుళమాల నమ్మలేక "వస్తే ఏరీ?" అన్నది.

"ఉదయంబండికి దిగి, సామాన్లు లక్ష్మణుడిద్వారా పంపి, అన్నయ్య దాన్ని తీసుకుని ఎక్కడికో వెళ్ళాట్ట. మేమ్‌సాబ్‌ను వాళ్ళింటిదగ్గిర దిగబెట్టి బాబుగారు అరగంటలో వస్తారని లక్ష్మణుడు చెప్పాడు."

"ఆవిడకి ఇల్లూ వాకిలీ లేదుటగా? ఎక్కడ దిగబెడతారూ? ఆవిడ వదలకపోతే?"

"అన్నయ్యకు మతిపోయిందాఏం? ఎక్కడోక్కడ దిగబెట్టివస్తాడు. నువు వెళ్ళి. నీళ్ళు పోసుకో."

వకుళమాల స్నానానికి వెళ్ళలేదు. చిట్టిని భుజాన వేసుకుని కాలుకాలిన పిల్లిలాగా ఒక గదిలోనుంచి మరొకగదిలోకి పచార్లు చేసింది. ఎనిమిదిన్నరకూడా అయింది. ఆమె తన ఆడబిడ్డదగ్గిరకు వెళ్ళి, "మీ అన్నయ్య ఇంకా రాలేదు. నా కేమీ బాగాలేదు. ఇలా ఎన్నడూ కాలేదు. ప్రతిసారీ వస్తున్నట్టు రాసేవారు—" అంటూండగా బయట కారు వచ్చిస చప్పుడయింది.

అవ్వ వచ్చి "బాబుగారు వచ్చారు." అన్నది.

కాని మెట్లమీద అడుగుల చప్పుడిలేదు. అవ్వ వెళ్ళి బాబుగారు కిందిగదిలోనే దుస్తులు మార్చుకుంటున్నట్టు చెప్పింది. వకుళమాల కిదీ కొత్తే. ఆమె నీరసంగా సౌదామిని గదినుంచి తనగదికి వెళ్ళి, బయటికి చూస్తూ కిటికీదగ్గిర నిలబడింది కొంతసేపయాక ఆమె వెనక్కు తిరిగేసరికి గదిమధ్య విజయుడు నిలబడిఉన్నాడు

"ఎప్పుడు వచ్చారు?" అన్న దామె చిరునవ్వుతో.

"ఇప్పుడే. కులాసాగా ఉన్నావా? చిట్టి కులాసాగా ఉందా? ఏదీ?"

వకుళమాల చిట్టిని తీసుకరావటానికి వెళ్ళి, పదినిమిషాలపాటు చిట్టికి తల దువ్వి అలంకరించి తీసుకువచ్చేసరికి విజయుడు సోఫామీద చేరగిలబడి కళ్ళు మూసుకుని ఉన్నాడు.

చిట్టి, "నాన్నా!" అని పెట్టిన కేకకు అతను కళ్ళు తెరిచాడు. చిట్టి తల్లి చంకనుంచి జారి తండ్రి రొమ్ముమీదికి వచ్చింది వకుళ సోఫామీద తన భర్తపక్కనే

కూర్చుని చేతులు చాస్తే చిట్టి రానసేసింది. "నే నిప్పుడు నీ కేమీ కానుటే?" అని వకుళ అడిగింది.

భార్యాభర్తలు కాస్సేపు చిట్టినిగురించీ, తరవాత విజయుడి రైలు ప్రయాణం గురించీ మాట్లాడుకున్నారు సుశీలను గురించి ఇద్దరూ మాట్లాడలేదు. ఆమె విషయము ఎత్తితే భర్త ఏమనుకునిపోతాడో అని భార్యా, భార్య అపోహపడుతుందేమో నని భర్తా అనుకోవటం జరిగింది

విజయుడు భోజనం చేసి కిందిగదిలో పక్క వేయించుకుని పడుకున్నాడు. కాని అతనికి వెంటనే నిద్రపట్టలేదు. బకురాణీకి సుశీ సంగతులన్నీ తెలుసును; అయినా ఆమె సుశీని గురించి ఏమీ అడగలేదు. కారణ మేమైఉంటుందోనని అత నాలోచించాడు.

అతను చివరకు నిద్రపోయి లేచేసరికి నాలు గయింది. అతను ముఖం కడుక్కుని, గడ్డం చేసుకుని, సూటు వేసుకుని, సిగిరెట్టు వెలిగించి, పెద్దకారు తీసుకురమ్మని సుందర్‌సింగుకు కబురు పంపి, జనానాలోకి వెళ్ళేసరికి, వకుళ, "షికారు వెళుతున్నారా? లోపలికి వచ్చి కూర్చోండి; కాస్త మాట్లాడాలి," అన్నది.

విజయుడు భార్యకు సమీపంగా వచ్చి, "నేను షికారు వెళుతున్నా నని ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"మీ రేంచేసినా నాకు తెలుస్తూనే ఉంటుంది. మీరు సుశీలదగ్గిరికి వెళుతున్నారు."

"వెళితే తప్పేం?"

"తప్పేమీలేదు. నాదగ్గిర సంగతులు దాస్తా రెందుకూ?"

"ఏం దాచానూ ?"

"మీ రావిడను కలకత్తా తీసుకువచ్చి ఎక్కడ దాచారో చెప్పారా ? చెబితే నేను మీ సుశీని లాక్కుపోతానా ?"

వకుళ తన ముఖానికి చేతు లడ్డం పెట్టుకుని నిశ్శబ్దంగా ఏడవసాగింది.

"ఇదేమిటి ? ఏడుస్తా వెందుకు ? ఏం జరిగింది ? నీ కేమైనా మతి పోయిందా ఏమిటి ? ఏడవకు ! ఊరుకో !"

అత నన్న మాటలతో వకుళ దుఃఖం మరింత అయింది. ఆమె ఏడవటం మానక పోతే సౌదామినినీ, తన వదినెనూ పిలుస్తా నన్నాడు విజయుడు.

"అందరినీ పిలవండి. నాపైన మీ కున్న ఆదరం అందరికీ తెలియజెప్పండి." అన్నది వకుళ తలఎత్తి.

"ఏం జరిగిందని పసిదానిలాగా హడావుడి చేస్తున్నావు ?"

"ఆడవాళ్ళు అప్పుడప్పుడూ కన్నీరు కార్చటం మంచిది."

అతను చేతిరుమాలుతో ఆమె కన్నీళ్ళు తుడుస్తూ, "ఒక పని చెయ్యి. చీరె మార్చుకుని నాతో రా." అన్నాడు.

"ఎక్కడికి ?"

"భర్తవెంట భార్య ఎక్కడికి వెళ్ళినా భయం లేదు. సీత రాముడివెంట దండకారణ్యానికి వెళ్ళలేదా ?"

"నాకు శూర్పణఖని చూపిస్తారా ఏం ?" అంటూ వకుళ నవ్వింది. విజయుడు తిరిగివచ్చాక ఆమె నవ్వటం ఇదే మొదటిసారి

"సుశీ ఎక్కడా దిగటానికి చోటులేక గ్రేట్ ఈస్టర్న్ హోటల్లో దించాను. జోడగిర్జా సమీపంలో చౌధురీగా రున్నారట. తల్లి పోయాక సుశీ కొన్నాళ్ళు వారింటో ఉన్నది. ఇప్పు డామె వారిదగ్గిరకి వెళ్ళి తనను భర్త వదిలేశాడని తానై ఎలా చెప్పుకుంటుందీ ? నే నాపని చేసిపెట్టాలి. అయిదుగంటలకు అక్కడికి వెళ్ళి ఆమెతో మాట్లాడి చౌధురిగారి దగ్గిరకు వెళ్ళాలి. రోజుకు పన్నెండు రూపాయలు ఇచ్చుకుంటూ ఆమె ఎన్నాళ్ళా హోటల్లో ఉంటుందీ ? పద పోదాం."

"నా నోరు బాగానే మూసేశారు. నే నా హోటలుకు రాను. అటువంటి అనాచారం నావల్ల కాదు. ఇంట్లోనే పూజ చేసుకుంటూ కూర్చుంటాను. టీకి నీళ్ళు పెట్టాను. టీ తీసుకుని వెళ్ళండి." అన్నది వకుళమాల.

"నువు నిజంగా హోటలుకు రావా ?"

"మీ కేమైనా వెర్రా ఏమిటి ? నేను చీరె మార్చి, కాలికి జోడు తొడిగి బయలు దేరితే ఇంటిల్లిపాతీ పరిగెత్తుకుంటూ వచ్చి, ఎక్కడి కని అడగరూ ? సుశీ ఊళ్ళోనే వుందిగా ? ఇంకోసారి చూస్తానులెండి. క్షణం కూర్చోండి, టీ తెస్తాను." అంటూ అవతలకి వెళ్ళిపోయింది.

విజయుడు టీ తాగి బయలుదేరి హోటలు చేరేసరికి అయిదుముప్పా వయింది. అయిదింటికి వస్తానని ఆలస్యం చేసినందుకు సుశీ కాస్త అలిగింది

"చాలా రోజులకు ఇంటికి తిరిగివచ్చారేమో. బకురాణీతో కబుర్లు చెబుతూ ఇక్కడికి రావాలన్న సంగతి మరిచిఉంటారు," అని సుశీ అతన్ని దెప్పింది.

"అవును బకు మూలానే ఆలస్య మయింది. టీ తాగందే వెళ్ళనిచ్చిందికాదు."

"టీ కూడా తాగివచ్చారా ? బాగుంది. నే నిక్కడ రెండు టీలకు ఆర్డరిచ్చాను."

"నువ్వింకా టీ తీసుకోలేదా ? అయితే పద. నేను మళ్ళీ తాగుతాను ఆ తర్వాత గంగవేపు మైదానంమీదికి పోదాం "

"ఇంట్లోనూ తాగుతారు. బయటా తాగుతారు; ఆశ "

"ఆశ లేకపోతే ఈ స్థితి కెందుకు వస్తాను ?"

ఇద్దరూ డైనింగ్ సెలూన్‌కు వెళ్ళి టీ తాగారు. సుశీ బకురాణి గురించీ, చిట్టి గురించీ అడిగి, "బకురాణీదగ్గిర నా మాట వచ్చిందా ?" అన్నది.

"వచ్చింది. ఆవిడనుకూడా నా వెంట రమ్మన్నాను. అనాచార మని వాదించింది. మరోరోజు వచ్చి నిన్ను చూస్తా నన్నది "

"షికారునుంచి నన్ను మీ ఇంటికి తీసుకు వెళతారా ? బకురాణిని చూస్తాను."

"ఇవాళే? ముందు షికారు పోదాం పద. ఈమాట దారిలో ఆలోచింతాం"...

* * * *

విజయుడు ఇంటినుంచి వెళ్ళిపోయాక వకుళ చిట్టిని ముస్తాబు చేసి, తోపుడు బండిలో షికారుకు పంపి, ఒకపుస్తకం తీసుకుని మేడపైకి వెళ్ళి, డాబామీద ఉన్న బెంచీమీద కూర్చుని పుస్తకం చదవసాగింది కాని ఆమెకు చదువు సాగలేదు. వెలుతురు తగ్గిపోతున్నది. తన భర్తా, సుశీ ఆ క్షణంలో, ఏం మాట్లాడుకుంటూ ఉంటారో ఊహించటాని కామె ప్రయత్నించింది.

సౌదామిని వచ్చి, బెంచిమీద వకుళ పక్కన కూర్చుని, "అన్నయ్య ఎక్కడి కెళ్ళాడు, వదినా ?" అని అడిగింది

"ఎక్కడికోక్కడికి వెళ్ళారు. నన్నుకూడా రమ్మన్నారు. నే నేం వెళ్ళలేదు."

"వెళ్ళవలిసింది! వెళ్ళి కుందనందినిని చూడివలసింది!"

"ఫో! నిన్నరాత్రి ఇలా మాట్లాడే నా మనసంతా పాడుచేశావు. ఇవాళ ఆయనతో ఏమేమో అన్నాను. తలుచుకుంటే సిగ్గేస్తున్నది. ఆయన ఏమనుకున్నారో?"

"కడుపులో పెట్టుకోవటంకన్న కక్కెయ్యటమే మంచిది."

"ఆయన కావిడమీద ప్రేమ వుందా?"

"నీ కేం వెర్రా? ఆవిడమీద అన్నయ్యకు ప్రేమ ఉండట మేమిటి?"

"ఇంత పొద్దుపోయి ఆయన ఎందుకు తిరిగిరాలేదు? ఆవిడ గురించి ఆయనకింత తాపత్రయం దేనికీ?"

"దిక్కులేని ఆడదీ! చిక్కుల్లో వుందీ! కాస్త సహాయం చేస్తే తప్పా?"

అంతలోనే విజయుడు కారులో తిరిగివచ్చాడు.

"జాగ్రత్త. అన్నయ్యదగ్గిర వెర్రివేషాలెయ్యకు. సుశీ మాట వస్తే మామూలుగా పోనియ్యి." అని సౌదామిని వకుళను హెచ్చరించింది. ఇద్దరూ మేడ దిగివచ్చారు.

వకుళ భర్తను కలుసుకోగానే, "ఏమయింది?" అని అడిగింది

"పొద్దుపోయింది. జోడాగిర్జాకు వెళ్ళటం పడలేదు.

"అయితే ఇంత ఆలస్య మయిందేం?"

"తొమ్మిదేగా అయిందీ? గంగఒడ్డున కాస్త తిరిగివచ్చాను.

ఒంటరిగానా, సుశీలతోనా అని అడగాలవి నోటిదాకా వచ్చింది గాని వకుళ అడగలేదు,

"నావెంట రమ్మంటే వచ్చావుకావు. నిన్ను చూడాలని సుశీల గిజగిజలాడింది. ఇవాళే వస్తా నన్నది. కష్టంమీద ఆపాను," అన్నాడు విజయుడు.

"ఆపటం దేనికీ? తీసుకురావలిసింది."

"నీ అనుమతి లేకుండానే?"

"ఇదెప్పటినుంచి?"

"మొదటినుంచీనూ. పద, భోజనం పెట్టుదువుగాని."

2

ఒకవారం గడిచింది. చౌధురీగారు కలకత్తాలో లేరు, త్వరలోనే వస్తా రని తెలిసింది. సుశీగురించి ఏ ఏర్పాటూ జరగలేదు. ఆమె హోటల్లో ఒంటరిగా ఎలా ఉంటున్నదీ తెలుసుకోవటానికి విజయుడు రోజూ వెళ్ళివస్తున్నాడు. అతను రాత్రి ఇల్లు చేరుకునేసరికి రాత్రి తొమ్మి దయేది. పగలుకూడా అతను భార్యకు ఎక్కువ



కనిపించేవాడుకాడు. రాత్రిపూట వకుళ ఏమీ అడిగేదికాదు. తాను భార్యపట్ల సరిగా ప్రవర్తించటంలేదని బాధపడేవా డతను.

* * * *

ఆరోజు శనివారం. మిట్టమధ్యాహ్నంవేళ భవానీపూరనుంచి సౌదామినికి ఉత్తరం వచ్చింది. ఆరాత్రి కల్పతరు థియేటరులో ఊర్వశీ సమాగమం అనే నాటకం ఉన్నది. దానికి సౌదామినినీ, వకుళమాలనూ తీసుకుపోతాం; సిద్ధంగా ఉండమని, విజనకుమారి అనే బంధువు రాసింది.

నాటకానికి విజయుడి వదినగారు రాననేసింది. విజయుడు టీ తాగటానికి వచ్చినప్పు డతని ఉద్దేశం తెలుసుకుందామంటే వీలుపడలేదు. సమయానికెవరో స్నేహితులు వచ్చేసరికి, అతను టీకోసం జనానాలోకి రాక, డ్రెస్సు వేసుకుని బయటికి పోతూ, రాత్రిభోజనానికి రాననీ, తను వచ్చేసరికి చాలా పొద్దుపోతుందనీ కబురుచేశాడు.

ఉత్తరంలో రాసినప్రకారం విజనకుమారి మరి ఇద్దరు స్త్రీలను వెంటబెట్టుకుని రానేవచ్చింది. వాళ్ళవెంట సౌదామినీ, వకుళా బయలుదేరారు.

తొమ్మిదిన్నరకు నాటకం ఆరంభమయింది. మొదటి అంకం జరుగుతూండగా విజయుడు కల్పతరు థియేటరుకు టెలిఫోన్ చేసి, ఒక బాక్సు రిజర్వు చేయించుకుని, మరికొంతసేపటికి టాక్సీలో సుశీతో సహా వచ్చాడు. అతనికి బెంగాలీనాటకం చూడాలనిలేదు, కాని ఎన్నడూ బెంగాలీనాటకాన్ని చూసిఎరుగని సుశీ పట్టుబట్టి అతన్ని తీసుకొచ్చింది. సుశీ ఆడవాళ్ళు కూర్చునే జనానావిభాగంకేసి చూసింది

రెండో అంకం ప్రారంభం కానున్నది. విజయుడు సుశీకి విక్రమోర్వశీయం కథ చెప్పాడు ఊర్వశీ పురూరవులు ఒకరి నొకరు చూపులమాత్రంచేతనే ప్రేమించుకున్నారని విని, "రాజుకు రాణు లెవరూ లేరా ?" అని సుశీ అడిగింది. తన కో భార్య ఉండగా రాజు ఊర్వశీకోసం వెర్రివాడు కావటం బాగాలేదని ఆమె వ్యాఖ్యానించింది.

రెండో అంకం ముగిసి తెర పడగానే విజయుడు, "కాసేపు బయటికి పోయి చల్లగాలి పోసుకుందాం. ఇక్కడ చాలా ఉక్కగా ఉన్నది." అంటూ సుశీని చెయ్యి పట్టుకుని బయటికి తీసుకుపోయాడు. వాళ్ళలా వెళ్ళారో లేదో పరదా స్త్రీ లుండే ప్రాంతంలో కలకలం బయలుదేరింది ఎవరో స్త్రీ మూర్ఛపోయింది. విజయుడూ, సుశీ తిరిగివచ్చి తమ స్థానాలలో కూర్చునేలోపుగా ఆ కలకలం ఉపశమించింది. వాళ్ళు మరి రెండంకాలు చూశాక విజయుడు "పన్నెండయింది. నాటకం ఇంకో గంటదాకా పూర్తికాదు. పోదాం పద," అన్నాడు.

ఇద్దరూ డైనింగ్ సెలూన్‌కు వెళ్ళారు సుశీ టీ తాగుతానన్నది కాని విజయుడు వెర్మత్ తెప్పించాడు

"ఏమి టాలోచిస్తున్నావు ?" అన్నాడు విజయుడు

"ఊర్వశీ పురూరవులను గురించి," అన్నది సుశీ.

"నీ కే ఘట్టం బాగా నచ్చింది ?"

"రాజు విరహం. ఆ రాజుకు ఊర్వశిపైన ఎంత ప్రేమ ! న న్నెవరైనా అలా ప్రేమిస్తే ఏం చేస్తానో !"

గవర్నమెంటు బంగళా గడియారం ఒంటిగంట కొట్టింది.

విజయుడామెను పడకగదిదాకా దిగబెట్టి, "వెళ్ళనా ?" అన్నాడు.

సుశీ, "వెళతారా ?" అన్నది వినపడీ వినపడకుండా.

"గుడ్‌నైట్ !" విజయుడామె చెయ్యితీసుకుని ముద్దుపెట్టుకుని వెళ్ళిపోయాడు. సుశీ తన పక్కమీద పడిపోయి, ముఖం దిండులోదూర్చి వెక్కివెక్కి ఏడ్చింది

విజయు డింటికి రాగానే, "అమ్మగారి కివాళ మూర్ఛ వచ్చింది." అని బేహరా చెప్పాడు.

"మూర్ఛ వచ్చిందా ? ఇప్పుడెలా గుంది ?"

"నింపాదిగానే ఉంది. నిద్రపోతున్నా రని ఇంతకు ముందేతెలిసింది."

వకుళకు మూర్ఛవచ్చిన దెక్కడని విజయు డడగలేదు, బేహరా చెప్పలేదు. అతను పైకి వెళ్ళటం మంచిదికాదనుకుని కిందనే పడుకుని కాస్సేపు వకుళమాలను

గురించీ, కాస్సేపు సుశీని గురించీ ఆలోచించాడు. వకుళకు ఒకప్పుడు మూర్ఛలు వచ్చేవి, కాని చిట్టి పుట్టాక నిలిచిపోయాయి. ఆమె ఆరోగ్యం చెడిపోయింది. ఒకటి రెండుమాసా లైనా తీసుకుపోవాలి.

సుశీ భవిష్యత్తు ఏమయేదీ తెలియదు. ఆమె ఎవర్నన్నా యోగ్యుణ్ణి పెళ్ళాడి సుఖ పడవచ్చు. ఇంతకూ పాల్ మొదటిపెళ్ళిసంగతి ఇంకా రూఢి కాలేదు. తాను మద్రాసు వెళ్ళిరావాలి.

ఇలా ఆలోచిస్తూ విజయుడు రెండగంట లయ్యాక నిద్రపోయాడు

మర్నాడతను లేచేసరికి చాలా పొద్దెక్కింది. అతను తొమ్మిదిగంటలకు టీకోసం పైకి వెళ్ళాడు. అతని వదినెగారు టీ ఇస్తూ, వకుళమాల కిందటిరాత్రి కల్పతరు థియేటరులో పదకొండుగంటలవేళ నాటకం చూస్తూ మూర్ఛపోయినట్టు చెప్పింది.

విజయుడి గుండెలో రాయిపడింది. వకుళ థియేటరులో తననూ, సుశీనీ చూసి ఉంటుందని అతను అనుకున్నాడు. అతను తన వదినెగారితో ఆమాటలూ ఈ మాటలూ చెప్పి వకుళ పడకగదికి వచ్చాడు

వకుళ సోఫామీద చేరగిలబడి కూర్చునిఉన్నది. ఆమెతో ఏదో మాట్లాడుతున్న సౌదామిని ఏదోవంక చెప్పి వెళ్ళిపోయింది. అతను ఆమె ముఖంకేసి చూడసాగాడు. అది కళాహీనంగా ఉన్నది.

"ఏమిటి చూస్తున్నారు?" అన్నది వకుళ.

"నా కీర్తి చూసుకుంటున్నాను. నీ అంతు ఇంకెంతలో తేలుతుందో ఆలోచిస్తున్నాను"

"నాది మొండిప్రాణం. అంత తేలిగ్గా అంతు తేలదు." అంటూ ఆమె భర్త చెయ్యి పట్టుకున్నది.

"నిన్న నా వెంట సుశీని చూసి నన్ను ఖర్చుసద్దులో వేసినట్టున్నావే ?"

"అదేమీలేదు. మిమ్మల్నామె అతిథిగా పిలిచినందుకు మీ రామెను నాటకానికి తీసుకెళ్ళా రనుకున్నాను."

"అనుకుని మూర్ఛపోయావు ! బకూ, మనిద్దరికీ ఉండే సంబంధం బూటకమా ?"

"ఎప్పటికీ కాదు."

"ఇప్పుడు మనం వెనకటిలాగా ఉన్నామా ?"

"మీకు తెలీదా ?"

"నాకూ తెలుసు, నీకూ తెలుసు. నేను వెనకటిలాగా ప్రవర్తించటం లేదు. పాపిని. సుశీ విషయంలో కాదు, నీ విషయంలో పాపం చేశాను. నువ్వయినా నాతో సరిగా ఎందుకులేవు ?"

"మీరు పాపాత్ములూ, నేను పుణ్యాత్మురాలినీనూ !"

అత నామెను సిమ్లాగానీ, డార్జిలింగ్‌గానీ, మసూరీగాని ఒకటిరెండు మాసాల పాటు తీసుకు పోతాననీ, అందువల్ల ఆమెకు బలం వస్తుందనీ అన్నాడు. తాను ముందుగా మద్రాసు వెళ్ళవలసినపనికూడా ఉందన్నాడు.

అతను రాత్రి బండికే ప్రయాణం పెట్టుకున్నాడు.

"సుశీ మీవెంట వస్తున్నదా ?" అని వకుళ అడిగింది.

"లేదు."

"ఎన్నాళ్ళు ప్రయాణం."

"పోను రెండురోజులూ, రాను రెండురోజులూ. అక్కడ రెండురోజులూనూ. అష్టమినాటికి వస్తాను. దశమినాడు మనం ప్రయాణం పెట్టుకుందాం."

అతను ఆరోజు సాయంకాలం ప్రయాణం పెట్టుకున్నాడు గనక, సుశీని చూడటానికి మధ్యాన్నం ఒంటిగంటకే హోటలుకు వెళ్ళాడు. సుశీ రూములోలేదు. ఎటో వెళ్ళిందనీ, రెండుదాకా రాదనీ అన్నారు. అతను రైల్వేఆఫీసుకు వెళ్ళి రాత్రి మద్రాసు మెయిలుకు టిక్కెట్టు కొని, బెర్తు రిజర్వు చేయించుకుని మళ్ళీ హోటలువద్దకు వచ్చేసరికి సుశీ కలుసుకున్నది.

అత నామెతో, క్రిందటిరాత్రి నాటకంలో బకురాణీ తననూ, సుశీనీ చూసిందనీ, ఆమెకూడా నాటకానికి వచ్చి పరదాస్త్రీలతో కూర్చున్నదనీ చెప్పాడు.

"బకురాణీకి కోపం రాలేదా ? ఆమె ఏమన్నది ?" అని సుశీ అడిగింది.



"కోపం వచ్చినదానిలాగా బకురాణీ నాతో ఏమీ అనలేదు." అన్నాడు విజయుడు.

సుశీ కొంచెంసేపు ఆలోచించి, "ఆమెకు కోపం రాకపోయినా ఇది మంచిపని కాదు," అన్నది.

"ఏది ?"

"మన స్నేహం. ఇద్దరమూ గంటలతరబడి ఒకేచోట ఉండటమూ, కలిసి షికార్లు వెళ్ళడమూ, భోజనాలు చెయ్యడమూ, నాటకాలకు పోవటమూ – ఇదంతా ఉచితమేనా ? బకురాణీ చాలామంచిది కనక సరిపోయింది. నేను చౌధురీగారింటికి వెళ్ళినాక మీరు తరుచు రానవసరం ఉండదు. కాదూ ?"

"నువు వద్దంటే రేపటినుంచీ రాను."

"ఎందుకు కోప్పడతారు ? మీ మంచికోసమే చెబుతున్నానని గ్రహించలేరా ?" ఆమె కన్నీరు రాల్చింది.

"ఒకటనబోయి ఇంకోటన్నాను. ఇవాళరాత్రి మద్రాసు వెళుతున్నాను. అది చెప్పటానికే ఈవేళప్పుడు వచ్చాను."

అతను సుసీకి మొట్టమొదటిసారిగా పాల్ మొదటిభార్య.గురించి చెప్పేశాడు.

"ఆయనకు అదివరకు ఒక పెళ్ళికాదు, పది పెళ్ళిళ్ళయినట్టు రుజువైతేమాత్రం మన కేం లాభం విజయబాబూ ?" అన్న దామె.

"పెళ్ళయినట్టు రుజువైతే నీ పెళ్ళి చెల్లదు. నువు యధేచ్ఛగా నీ యిష్టంవచ్చిన వాణ్ణి పెళ్ళాడవచ్చు."

సుశీ అక్కడ కనబడుతూన్న గవర్నరు బంగళాకేసి చూపిస్తూ, "అయితే ఆ గవర్నరును పెళ్ళాడవచ్చా ?" అన్నది

"ఆయనకు భార్య వుండదూ ?"

"ఆ భాగ్యానికి డబ్బు తగలేసి మీరు మద్రాసు పోకపోతే నేం ?"

"ఇంత మహానగరంలో గవర్నరుతప్ప నీకు ప్రేమించదగినవాడు దొరకడా ? ప్రేమించినవాణ్ణి పెళ్ళాడటానికి నీకు అవకాశం ఉంటుంది."

"నేను త్వరగా ఎవరినో ఒకరిని పెళ్ళాడెయ్యాలనేనా మీ కోరిక ?"

"అవును."

సుశీ ముఖం వివర్ణ మయివంది. ఆమె ముఖం పక్కకు తిప్పుకుని, "నేను మీకు భార మయానుకాదూ ! మద్రాసు వెళ్ళివచ్చి నా బరువు దించేసుకోండి." అన్నది.

తాను మద్రాసు పోవటం గురించి ఆమె అలా అనుకుంటుం దని అతను కలలో కూడా అనుకోలేదు. "మా వ్యవహారం కణుపు దాటేస్తున్నది. ఇంక వెనక్కు తిరగబోతే అగాధంలో పడిపోతాం. నే నింక ఒక్క అడుగైనా ముందుకు వెయ్యరాదు." అనుకున్నా డతను.

అతను హోటల్లో టీ తాగి ఇంటికి పోతూ, రాత్రి తొమ్మి దింటికి వచ్చి ఆమెను రైలు స్టేషనుకు తీసుకుపోతా ననీ, ఆమె అతన్ని సాగనంపి, తన కారులోనే హోటలుకు తిరిగి పోవచ్చు ననీ అన్నాడు.

ఇంటికి వెళ్లాక అతను వకుళతో మాట్లాడటం పడలేదు. అతను తన సామానును బేహరా వెంట బండిలో పంపి, బయలుదేరిపోతుండగా వకుళ వచ్చి వంగి ప్రణామం చేసి, "ఆశీర్వదించండి !" అన్నది.

అత నామె చెక్కిళ్ళు తాకి, "భర్తకు ఇష్టురాలివి కా !" అన్నాడు.

అతను హోటలుకు చేరేసరికి సుశీ సోఫామీద, తాను కిందటిసారి విడిచివెళ్ళి నప్పటిలాగే కూర్చునిఉన్నది. ఆమె ఇంకా భోజనం చెయ్యలేదు. బండికి ఆటే టైములేదు. వెంటనే భోంచెయ్యమంటే, అతన్ని పంపించివచ్చి చేస్తా నన్నది.

"ఆలస్యంగా తింటే జబ్బు చేస్తుందేమో ?" అన్నా డతను.

"జబ్బు చెయ్యదు; రాయి అయిపోయాను." అన్న దామె.

తాను మద్రాసు వెళ్ళుతున్న పని ఆమెకు అప్పుడే చెప్పకుండాఉంటే బాగుండే దేమో ననుకుని, అతను సోఫామీద ఆమె పక్కనే కూర్చుని, "నేను మద్రాసు వెళ్ళటం నీకు బొత్తిగా ఇష్టంలేదా ? ఇష్టం లేకపోతే మానేస్తాను," అన్నాడు.

"నా మాట విని ప్రయాణం ఆపటానికి నేను మీ కెవర్ని విజయబాబూ?'' అన్నదామె. ఆమె కళ్ళవెంట జలజలా నీరు కారింది.

విజయు డామెను తన రొమ్ముకేసి గట్టిగా అదుముకుని, "నా కెవరివా? నా ప్రియురాలివి! ప్రియురాలివి!" అంటూ వెర్రిగా ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె అతన్ని వారించా లని ప్రయత్నం చెయ్యలేదు. ఆమె తల ఎత్తి అతని ముఖంలోకి చూసి, "అయితే నన్ను వదిలించుకోవా లనుకున్నా రెందుకూ?" అని తన తలను అతని భుజంమీద వాల్చేసింది.

ఆమె మూర్ఛ పోయిం దని తెలిసి అతను ఆయాను కేకపెట్టి, వెంటనే డాక్టరును పంపమని మేనేజరుకు చీటీ రాసి పంపాడు తరవాత సుశీని సోఫామీద పడుకోబెట్టి, ముఖాన చన్నీళ్ళు చల్లాడు.

ఒక లావుపాటి దొరసాని వచ్చి, తాను నర్సు నని చెప్పి, అతన్ని అవతలికి పంపి, అయిదు నిమిషాలలో సుశీకి స్పృహ తెప్పించింది. ఆమె వెళ్లాక విజయుడు లోపలికి వెళ్ళి, ఆమె కోరికపైన ఆమెకు సమీపంగా కుర్చీ వేయించుకుని కూర్చున్నాడు

నర్సు సుశీకోసం బీఫ్‌టీలో బ్రాందీ కలిపి పంపింది సుశీ అది తాగి తేరుకుని త్వరలోనే నిద్రపోయింది. పదిన్న రయింది.

"నిన్నరాత్రి ఒకతె మూర్ఛపోయింది. మరో ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే మరొకతె మూర్ఛపోయింది. ఎంత అదృష్టవంతుణ్ణి!" అనుకున్నాడు విజయుడు.

కొంత సేపటికి బేహరా హోటలుకు వచ్చి, "బండి వెళ్లిపోయింది, హుజూర్" అన్నాడు విజయు డతన్ని సామాన్లు ఇంటికి తీసుకుపొమ్మన్నాడు.

3

విజయుడు రాత్రి పన్నెండు గంటలదాకా సుశీ గదిలో ఉన్నాడు. ఆమె లేచి నపుడు తీసుకోవడానికి బ్రాత్, పుడింగ్ మొదలైనవి గదిలో తెప్పించి ఉంచి, తాను మర్నాడు తొమ్మిదింటికి వస్తానని ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయాడు.

సుశీ రెండుగంటలవేళ లేచింది. విజయుడు రాసిన మొదటి "ప్రేమ లేఖ" చదువుకున్నది. తాను మూర్ఛపోయినట్టు ఆయాద్వారా తెలుసుకున్నది. బ్రాత్ వెచ్చ బెట్టించుకుని తాగి, పుడిగ్ కొంచెం రుచిచూసి, మళ్ళీ పడుకుని నిద్రపోయింది.

మర్నా డుదయం ఆమె లేచేసరికి ఎనిమి దయింది. మరో గంటలో, విజయుడు వచ్చేలోపుగా, స్నానం చేసి సిద్ధంగా ఉండగలనా అని ఆమె భయపడు

తూండగా, విజయుడు నౌకరుద్వారా ఆమెకు చీటీ పంపాడు. అందులో అతను తన ఇంట్లో గొడవగా ఉన్నదనీ, ఈపూట రాలేననీ, సాయంకాలం తప్పక వస్తాననీ రాశాడు. ఆమె ఎలా ఉన్నదని అడిగాడు. తాను సరిగానే ఉన్నాననీ తనని గురించి విచారించ వద్దనీ, అతను రాసిన విషయం అర్ధం కాలేదనీ, అతనికోసం ఎదురు చూస్తుంటాననీ ఆమె సమాధానం రాసి, "సుశీల" అని సంతకం చేసింది.

సాయంకాలందాకా ఆమె ఆరాటంతో ఏ పనీ చెయ్యలేకపోయింది. విజయుడు తమ సంగతి తన భార్యకు చెప్పి ఉంటాడనీ, అతని కే మాయా మర్మమూ తెలీదనీ, అందుకే ఇంట్లో గొడవ అయిఉంటుందనీ ఆమె ఊహించింది.

విజయుడు సాయంకాలం వచ్చాడు. అతడి ముఖం వాడిపోయి ఉన్నది. సంగతంతా బకురాణీకి చెప్పేశానని అత నన్నాడు.

"నాకు ముందే తెలుసును. నే ననుకున్నట్టే అయింది," అన్నది సుశీ.

"నీమీద నాకు ప్రేమ అని చెప్పినప్పుడు బకురాణీకూడా నీలాగే తనకు తెలుసు నన్నది," అన్నా డతను.

ఇద్దరూ కబుర్లు చెప్పుకునేటప్పుడు సుశీ, "మీకు వివాహం కాకుండా ఉంటే నేను మీదా న్నయేదాన్ని," అన్నది.

హిందూ స్త్రీలు సహించే నిర్బంధాలనుకూడా తాను సహించేదా నిన్న ఆమె అన్నది.

ఇద్దరూ టీ తాగి విజయుడి కారులో మైదానంమీదికి షికారు బయలుదేరారు. ఆ రోజల్లా ఉక్కబెట్టింది. కాని మైదానం మీద కొంచెం చల్లగా ఉన్నది. ఒక గంటసేపు అక్కడ కారుషికారు తిరిగి, విజయుడు కారును ఈడెన్ గార్డెన్‌దగ్గర ఆపాడు. ఇద్దరూ తోటలోకి ప్రవేశించి, నడుచుకుంటూ ఒక నిర్జనప్రదేశానికి వెళ్ళి కూర్చున్నారు.

"నాకు పెళ్ళి అయిఉండకపోతే నాదానవై ఉండేదాన నన్నావే, అది మనస్ఫూర్తిగా అన్నమాటేనా ?" అని విజయు డడిగాడు

"అవును," అన్న దామె.

"నాకు భార్య ఉన్నప్పటికీ నాదానివి కమ్మంటే కావా ?"

"మీరు ఆత్మార్పణం చేసుకున్న మనోమనీషికి బాధ కలిగించటం ధర్మమా ?"

"ఆవిడకు బాధ లేదనుకో. ఆమె సమ్మతించిం దనుకో."

బకురాణీ సమ్మతిస్తుందని సుశీ ఊహించలేకపోయింది. కాని తాను సుశీని పెళ్ళాడితే బాగుంటుందన్న ఆలోచన బకురాణే చెప్పిందని విజయు డన్నాడు.

యువ

"మనస్ఫూర్తిగానే అన్నదా ?"

"అలాగే తోచింది "

"నమ్మశక్యం కాకుండా ఉంది."

హిందూస్త్రీలలో అలాటి స్వార్థరాహిత్యం ఉందని విజయుడు ఉదాహరణ లిచ్చి, "సుశీలా, బాగా ఆలోచించుకో. భార్యా, ఒకపిల్లా ఉన్నవాణ్ణి చేసుకోవటం ఏస్త్రీకూడా కోరదగినసంగతి కాదు నా బంధువులు విన్నెలా చూస్తారో తెలీదు, ఇవన్నీ ఆలోచించుకుని నా భార్యవు కావటానికి సమ్మతిస్తావేమో నిర్ణయించుకో. టైము తీసుకునే చెప్పు. నిన్ను తొందరపెట్టను," అన్నాడు.

"ఆలోచించే దేమీలేదు. బకురాణీకి అన్యాయంగాని, బాధగాని కలగదని మీరు మాట ఇస్తే, నా కేమీ అభ్యంతరంలేదు," అన్నది సుశీ.

ఇంతలో వానచినుకులు సాగాయి. వారు బయలుదేరి కారుదగ్గిరికి చేరుకునేలోపుగా వర్షం హెచ్చటంచే తడిసి ముద్దయారు. సుశీని హోటలుదగ్గిర దించి, అతను కారులో వెళ్ళిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం అతను హోటలుకు వచ్చి, సుశీ పెళ్ళికి ఒప్పుకున్నదని తాను తన భార్యకు చెప్పినట్టూ, ఆమె మంచిదే నన్నదనీ, పెళ్ళి జరగటం విషయం చర్చించిందనీ సుశీకి చెప్పాడు.

సుశీ కొంచెం ఆలోచించి, "ఆమె ప్రేమ సముద్రంలాటిది !" అన్నది. ఆమె

తమ వివాహం ఏలా జరుగుతుందని అడిగింది. "మనం ముసల్మాను మతమైనా పుచ్చుకోవాలి, ఆర్యసమాజంలో నైనా చేరాలి," అన్నా డతను. ఆర్యసమాజంలో కూడా భర్త ఒకభార్యమీద మరొక భార్యను చేసుకోవచ్చుగాని, భార్య ఒకభర్త ఉండగా మరొకభర్తను చేసుకోవటానికి వీల్లేదు. అందుచేత అతను పాల్ మొదటి వివాహంసంగతి రూఢి చేసుకోవడానికి మద్రాసు వెళ్ళాలి.

టీ తాగి, వాళ్ళిద్దరూ బజారుకు వెళ్ళి ఉంగరం ఒకటి కొన్నారు. అతను ఆమెతో తన మద్రాసు ప్రయాణం గురించి చెప్పినప్పుడు సుశీ, "పాల్ అన్న మాటలు మీరు నిజంగా నమ్ముతున్నారా?" అన్నది: పాల్ తను చేసుకున్నదే మొదటి పెళ్ళి అయిఉంటుం దని ఆమె వాదించింది.

"ఈమాట అదివర కెందుకు చెప్పలేదు," అన్నాడు విజయుడు.

"మనకు పెళ్ళవుతుందని నేను కలగన్నానా? పాల్‌కు అదివరకు పది పెళ్ళిళ్ళయితేమాత్రం నాకు ఒరిగే దేమి టనుకున్నాను."

విజయుడికి గుండెలో రాయి పడింది. అతను తాను కొన్న ఉంగరాన్ని సుశీకిస్తూ, "ఈ ఉంగరం నీదగ్గిరే ఉంచు. మద్రాసు వెళ్ళివచ్చాక, పరిస్థితి అనుకూలంగా ఉంటే అప్పుడు దీన్ని నీ వేలికి పెడతాను." అన్నాడు.

ఆరాత్రి వాళ్ళిద్దరూ హోటలులో భోజనం చేసి కబుర్లు చెప్పుతుంటూ ఉండగా బేహారా ఒక ఉత్తరం తెచ్చాడు. అది చౌధురీగారు రాసిన ఉత్తరం. ఆయన కిందటి రోజే కలకత్తా చేరాడట. బొంబాయినుంచి పాల్ వచ్చి, తాను తన భార్యకోసం ఎంత వెతికినా కనిపించ లేదుట. పాల్ తన భార్యకోసం చాలా దిగులు పడుతున్నాడు గనక సుశీ గురించిన వివరా లేమైనా తెలిస్తే చెప్పమంటూ చౌధురీ రాశాడు.

మర్నాడు ఉదయం విజయుడు చౌధురీగా రింటికి వెళ్ళి, చౌధురీగారి సమక్షంలో పాల్‌తో మాట్లాడదా మనుకున్నాడు. కాని పాల్ లేడు. విజయుడు చౌధురీగారితో సుశీ కులాసాగా ఉన్నట్టు చెప్పాడు. కాని ఆమె ఎక్కడ ఉన్నదీ చెప్పలేదు.

ఆ సాయంకాలం విజయుడు బయటికి బయలుదేరబోతుండగా పాల్ వచ్చాడు. తాస్సేపు విజయుడిపైన ఎబ్డక్షన్ కేసు చేస్తున్నా నన్నాడు; తనకు ముందొక పెళ్ళి కాలేదనీ, తాను తాగిన మైకంలో ఏమేమో వాగి ఉంటాననీ అన్నాడు; విజయుడిడిగి తెప్పించుకుని విస్కీ తాగాడు. చివరకు, ఒక వెయ్యిరూపాయి లిస్తే పొగచుట్టాల వ్యాపారం చేసుకుంటా నన్నాడు. ఒక్క పైసాకూడా ఇవ్వనని గట్టిగా చెప్పేసి, విజయుడు పాల్‌ను సాగనంపాడు.

సుశీ విజయుడిద్వారా ఈ విషయాలు విని భయపడింది. పాల్ కలకత్తా వదిలి వెళ్ళేదాకా తాను సుశీని ఒంటరిగా విడిచి మద్రాసు పోనని విజయుడు మాటఇచ్చాడు.

* • •

ఆ రాత్రి తొమ్మిదింటికి చౌధుగారిగారు విజయు డింటికి వచ్చి పాల్‌ను పోలీసులు వారంటు తెచ్చి ఎరెస్టు చేసి పట్టుకుపోయా రని చెప్పాడు. వారంటు బొంబాయినుంచి వచ్చింది. 409 సెక్షను కింద పాల్‌ను ఎరెస్టు చేశారు. చౌధురీగారు పాల్‌ను జామీనుమీద విడిపించమని కోరినా పోలీసులు సమ్మతించలేదుట. పాల్ బంధువులకూ, సుశీకి ఈ సంగతి తెలియటం మంచి దన్నాడు చౌధురిగారు.

"సుశీకి నేను చెబుతాను. పాల్ బంధువుల్లో ఒకరి చిరునామా నా దగ్గిర ఉన్నది," అంటూ విజయుడు సోఫీ రాసిన ఉత్తరం తీసి ఆయన కిచ్చాడు.

ఆయన ఉత్తరం చూసి, "ఈ సోఫీ ఎవరు ?" అని అడిగాడు.

"పాల్ భార్య; 1907 నవంబరు 6న మద్రాసులోని బాప్టిస్టు చాపెల్‌లో వా రిద్దరికీ పెళ్ళి అయింది." అన్నాడు విజయుడు.

చౌధురీగారు ఆగ్రహావేశంలో, "బద్మాష్ ! సుశీని నాశనం చేశాడు. ఎంత దుర్మార్గుడు !'' అన్నాడు.

విజయు డాయనకు దాచకుండా అంతా చేప్పేశాడు: తా మిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్న సంగతి మాత్రం చెప్పలేదు. ఆయన అంతా విని బయలుదేరి వెళుతూ, ''సుశీ అదృష్టవంతురాలు. అందుకే ఆమెకు మీవంటి యోగ్యుడి అండ లభించింది. రేపామెను మా యింటి కొకసారి పంపండి ! పూర్ గరల్ !" అన్నాడు.

మర్నాడే అతను మద్రాసుకు ప్రయాణం కట్టాడు. అతను సామానులు సర్దుకుంటూ ఉండగా వకుళమాల అతనికోసం కబురు చేసింది.

"నిన్న విజనకుమారి వచ్చింది. వాళ్ళ కుర్రాడి ఆరోగ్యం కోసం పూరీ వెళ్ళి ఒకటి రెండుమాసా లుంటారు. సముద్రపుగాలికి ఆరోగ్యం బాగుపడుతుం దన్నారుట. ఇల్లుకూడా అద్దెకు తీసుకున్నారు నన్నుకూడా తమవెంట రమ్మన్నది." అన్నది వకుళ అతనితో.

''నీ వంట్లోకూడా ఏమీ బాగాలేదు. వెళ్ళరాదూ ?''

"నా కేం జబ్బు ? కాని ఒక టనుకున్నాను. మీరు మద్రాసు నుంచి నాలుగు రోజుల్లో తిరిగివస్తారు. విజనకుమారి వెంట వెళ్ళి, అక్కడ రెండు మూడు రోజు

లుండి దేవుడి దర్శనం చేసుకుని, మీరు తిరిగి వచ్చేటప్పు డక్కడ దిగితే, మీ వెంట వచ్చెయ్యవచ్చు ననుకున్నాను మీ కేమైనా ఇబ్బందా ! ''

''నా కేం ఇబ్బంది ?''

* * *

అతను రెండుగంటలకు వెళ్ళి, తాను రాత్రిబండికి మద్రాసు పోతున్నాననీ, పాల్‌ను పోలీసులు పట్టుకెళ్ళారు గనక ఆమె కేమీ భయం ఉండదనీ, తాను తిరిగి వచ్చినదాకా ఆమె చౌధురీగా రింట ఉంటే బాగుంటుందనీ సుశీతో అన్నాడు.

సుశీ అతని కొక విషయం జ్ఞాపకం చేసింది. వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఏడురోజుల క్రితం మొదటిసారి చూసుకున్నారు. అది మొదలు ప్రతిరోజూ కలుసుకుంటూనే ఉన్నారు. అతను నెక్‌లెస్‌కోసం సోహాగ్‌పూర్‌నుంచి జబల్పూరు వెళ్ళినప్పుడు నాగా పడిఉండవలసింది. కాని అదృష్టవశాన మర్నాడు రాత్రికే తిరిగివచ్చి, ఆమె మెడలో, వరమాల వేసినట్టుగా, నెక్‌లేస్ తగిలించాడు ! కాని ఈసారి నిజంగా నాగా పడబోతున్నది ! ...

4

పూరీలో విజనకుమారీవాళ్ళు అద్దెకు తీసుకున్న మేడ సముద్రం ఒడ్డునే ఉన్నది. కొడుకు జబ్బువాడు కావటంచేత విజనకుమారి ఇల్లు కదిలేదికాదు వకుళ విజనకుమారి పినతల్లి వెంట ఆలయుంలో ఎక్కువకాలం గడిపేది. వకుళతో వచ్చిన సౌదామినికి వరండాలో కూర్చుని సముద్రంకేసి చూడటం సరదా అందుచేత ఆమెకూడా విజనకుమారిలాగే ఎక్కువసేపు ఇంటి నంటిపెట్టుకుని ఉండేది.

వాళ్ళిద్దరూ కూర్చుని ఒకనాడు వకుళను గురించి మాట్లాడుకున్నారు. తన భర్త మరొకతెను పెళ్ళాడటానికి ఒప్పుకోవటంలో ఆమె ఎవరినీ సంప్రతించక తొందరపడింది; మనస్సు చెడిపోయి దేవుళ్ళకు దణ్ణాలు పెట్టుకుంటున్నది ! తన అన్న కిరాస్తానీదాన్ని చేసుకోవటం సౌదామినికి ఇష్టం లేదు

ఆరోజే విజనకుమారిభర్త విపినబాబు కొక టెలిగ్రాం వచ్చింది. విజయుడికి జబ్బుచేసింది; సాయంకాలం బండికి మద్రాసునుంచి వస్తున్నాడు; అతనివెంట ఒక డాక్టరుకూడా వస్తున్నారు; రైలుకు మేనా పంపాలి.

విజయుణ్ణి రైల్లోనుంచి దించి మేనాలో చేర్చేసమయంలో అతను జ్వరంతో



వళ్లు తెలియనిస్థితిలో ఉన్నాడు. అతన్ని ఇంటికి చేర్చాక విపినబాబు పూరీలో ఉండే సివిలుసర్జన్ను పిలిపించి పరీక్ష చేయించాడు. విజయుడికి తగిలిన జర్వం టైఫాయిడ్‌లోకి దించవచ్చునని డాక్టరన్నాడు.

విజయుడి జ్వరం తెల్లవారుజామున కాస్త తగ్గింది. అతను కళ్ళు తెరిచి వకుళను చూశాడు. విజయదశమినాటికి అతను తన భార్యను చూసినందుకు తృప్తిపడి. సుశీనికూడా చూడాలని ఉన్నట్టు ఆమెతో అన్నాడు. అతనికి బతకనని అధైర్యం పట్టుకున్నది.

తెల్లవారుతూనే వకుళ సుశీకి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇప్పించింది.

ఆ టెలిగ్రాం అందకపూర్వం సుశీకి మద్రాసునుంచి విజయుడు పంపిన టెలిగ్రాములు రెండు అందాయి అతను మద్రాసు చేరినట్టు ఒక టెలిగ్రాం ఇచ్చాడు; పాల్‌కు లోగడ పెళ్ళి అయినట్టు రిజిష్టరులో ఉన్నదని మరొక టెలిగ్రాం ఇచ్చాడు. తరవాత ఏ వార్తాలేదు. ఆమె ఆదుర్దా పడుతుండగా వకుళ పంపిన టెలిగ్రాం వచ్చింది.

సుశీకి ఆ రాత్రిదాకా బండీలేదు తానా బండికి బయలుదేరుతున్నానని వకుళకు టెలిగ్రాం ఇచ్చి, ఏం చెయ్యటానికీ తోచక ట్రాం ఎక్కి, కాళీఘాటుదాకా వెళ్ళి, తన కాబోయే భర్తను కాపాడమని కాళీమాతకు మనసులో దణ్ణం పెట్టుకున్నది.

సుశీని తీసుకురావటానికి విపినబాబు స్టేషను కెళ్లాడు. వకుళ ఆమెను చెయ్యి

పట్టుకుని మేడమీద తనగదికి తీసుకుపోయింది. తరవాత ఇద్దరూ విజయుడు పడుకున్న గదికి వెళ్ళారు. సౌదామిని అతనికి కాళ్లుపట్టుతున్నది. అతను నిద్ర పోతున్నాడు. విజయుణ్ణి చూడగానే సుశీకి కంట నీరు తిరిగింది వకుళ ఆమెను చప్పున ఇవతలికి తీసుకువచ్చి, ఆమె కళ్ళు తుడుస్తూ, "ఏడవ్వద్దు. భయం దేనికి? భగవంతుతున్నాడు." అన్నది.

తాను క్రిస్టియను కావటంచేత ఆ ఇంట్లో మిగిలినవారికి ఇబ్బందిగా ఉంటుందేమో నని సుశీ భయపడింది. కాని తమకూ విజనకుమారికీ అలాటి పట్టింపులు లేవని వకుళ ఆమెతో అన్నది.

సుశీ స్నానం చేసేసరికి విజయుడు నిద్ర లేచి ఆమె వచ్చిందా అని అడిగాడు సుశీ అతని దగ్గిర కెళ్ళి కనబడింది అది మొదలు అతనికి అస్తమానమూ దగ్గిర ఉండి ఆమె అన్ని ఉపచారాలూ చేస్తూవచ్చింది.

"ఎవతో వచ్చి నీ భర్తను కాజేసుకుపోతుంటే, నువు చూస్తూ ఊరుకోవటం ఏమీ బాగాలేదు." అని విజనకుమారి వకుళను హెచ్చరించింది. వకుళ ఆమె మాటలు పట్టించుకోలేదు.

ఉన్నట్టుండి కలకత్తానుంచి విజయుడి వదిగారు దిగింది. ఆవిడ చాలా ఆచారవంతురాలు. తన వెంట పెద్ద బిందెడు గంగాజలం తెచ్చుకున్నది. ఆమె విజయుణ్ణి చూసి, "నీకు జబ్బు నయమవుతుంది. కాళీమందిరంలో పూజ చేసి వచ్చాను. తులసికోటలో నుంచి మృత్తిక తెచ్చాను," అంటూ మన్ను తీసి అతని నుదుటికీ, నెత్తికీ రాచింది.

ఆమె అక్కడ ఉండగానే సుశీ వచ్చి అతనికి ఔషధ మిచ్చింది.

"నువు ఎవ రమ్మాయ్?" అని ఆవిడ సుశీని అడిగింది

"మా స్నేహితురాలు," అని సౌదామిని చెప్పింది.

"ఎవరో కిరస్తానీ నర్సు అనుకున్నా," అన్న దావిడ.

కాని ఆమెకు సుశీ సంగతి తెలియనే తెలిసింది. ఆవిడ మండిపడి, సుశీని చీపురుతో వెళ్ళగొడతా నన్నది. గంగా జలం వెంట ఉండటం ఆవిడకు చాలా మేలయింది. సుశీ రావటంచేతనే విజయుడు కోలుకుంటున్నా డని విని ఆవిడ కొంత వరకు సమాధానపడింది

ఇరవై రెండో రోజు విజయుడికి జ్వరం రాలేదు. డాక్టరు సలహా మీద విజయుడు మరొక నెలపాటు పూరీలోనే ఉండిపోయాడు. కాని అతని వదినెగారు మాత్రం అతనికి పథ్యం పెట్టగానే కలకత్తాకు తిరిగిపోతూ, సుశీనికూడా తనతో వచ్చెయ్య మన్నది "నీ మంచి కోరే చెబుతున్నాను. నీకు ప్రపంచజ్ఞానం లేదు. తరవాత పశ్చాత్తాప పడతావు. నీ ప్రాణంతో బాటు మరిద్దరి ప్రాణాలుకూడా తీస్తావు." అన్న దామె సుశీతో. అంతతో పోనివ్వక, సుశీ తన వెంట కలకత్తాకు బయలు దేరాలని చాలా తొందర పెట్టింది.

"నే నిప్పుడు రాను. తరవాత వెళతాను," అన్నది సుశీ స్పష్టంగా.

విజయుడి వదినెగారు వెళ్లిపోయాక కూడా సుశీ మనసు మనసులో లేదు. "అలా ఉన్నావేం?" అని వకుళ అడిగితే, ఆమె ఏమీ చెప్పలేదు.

"మా తోడికోడలు ఏమైనా అన్నదా?" అని వకుళ అడగింది.

"నన్ను తన వెంట కలకత్తా రమ్మన్నది. నేను వెళ్లి ఉండవలిసిందేమో, అక్కా. నే నిప్పుడు ఎవరికీ తెలియకుండా వెళ్లిపోతే ఏమిటి నష్టం?" అన్నది సుశీ దీనంగా.

"ఏమిటీ వెర్రిమాటలు? నీమీద ఆశలు పెట్టుకుని ఉన్న మనిషి ఏమవతా రను కున్నావు? ఆయన ని న్నేమన్నా అన్నారా ఏమిటి?"

"లేదు. నాకే అనిపిస్తున్నది"

వకుళ సుశీకి ఎంతో మంచిగా నచ్చజెప్పింది. తన భర్త సుశీని పెళ్ళాడటం చేత తన జీవితం ఏమీ భ్రష్టయిపో దన్నది. ఇద్దరు స్త్రీలు ఒక భర్తతో ఎందుకు కాపరం చెయ్యగూడ దని అడిగింది.

విజయుడికీ సుశీకీ వివాహం జరపటానికి శుక్రదేవ నీలాంబర త్రివేదీ అనే ఆయన వచ్చాడు. సుశీకి ప్రాయశ్చిత్తకర్మ జరిపించి, తరవాత మూడురోజులకు వివాహం ఏర్పాటు చేశాడు. రేపు కోర్టు తెరుస్తారనగా విజయుడికీ సుశీకి వివాహ మయింది.

పెళ్ళి కాగానే సుశీ వకుళ కాళ్ళకు దణ్ణం పెట్టింది. వకుళ ఆమెకు బంగారు కుంకుమ బరిణ ఇచ్చి, "ఈ కుంకం నీకు అక్షయంగా ఉండుగాక!" అన్నది.

ఇద్దరూ కౌగలించుకుని ఆనందబాష్పాలు రాల్చారు.

—౦౦—